WANTED
స్టాఫ్ రిపోర్టర్లు & విలేకర్లు కావలెను
చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలు ప్రధాన కేంద్రంగా వెలువడుతున్న
స్వర్ణసాగరం దినపత్రికలో
పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు
జిల్లా కేంద్రాలలో స్టాఫ్ & రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణాలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం, అర్హతను భట్టై ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి : 94403 52036,9949329705

మా కలం - సామాన్యుడి బలం

# స్వర్ణసాగరం

www.swarnasagaram.in జాతీయ తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ తెలంగాణ | సంపుటి : 6 | సంచిక : 172 | పేజీలు : 8 | ఎడిటర్ : డా.దామా విజయ్‌కుమార్ | ఆదివారం 15 జూన్ 2025 | వెల : 2-00

- అమరావతిపై వైఖరి మారలేదా...
- కూటమి ప్రభుత్వం వన్ ఇయర్ పాలనను పూర్తి చేసుకుంది
- వైసీపీ అపోజిషన్‌లోకి వచ్చి ఏడాది అవుతుంది
- ఈ సంవత్సర కాలంలో పోరాడి నిలబడాల్సిన వైసీపీ ఇంకా అయోమయంలో పడిందా అంటే అవుననే టాక్ వినిపిస్తోంది.
- ఏ విషయంలో అయితే ఎక్కువగా గెలుకోకూడదో..అలాంటి ఇష్యూల్లోనే వైసీపీ అధినేత, ఆ పార్టీ నేతలు అవసరానికి మించి మాట్లాడుతుండటం..ఫ్యాన్ పార్టీ క్యాడర్, లీడర్లను గందరగోళంలోకి నెట్టేస్తుందట.

# అయోమయంలో వైసీపీ!



## రాజధాని మ్యాటర్‌లో తమ స్టాండ్ ఏంటో చెప్పకుండానే..
## అనుచిత వ్యాఖ్యలతో ఇరకాటంలో వైసీపీ

**స్వర్ణసాగరం అమరావతి,**

వైసీపీ అధినేత, ఆయన సన్నిహితులు మాత్రం రాజధాని మ్యాటర్‌లో తమ స్టాండ్ ఏంటో చెప్పకుండానే..అనుచిత వ్యాఖ్యలతో ఇరకాటంలో పడిపోతున్నారు.కూటమి ప్రభుత్వం వన్ ఇయర్ పాలనను పూర్తి చేసుకుంది. వైసీపీ అపోజిషన్‌లోకి వచ్చి ఏడాది అవుతుంది. ఈ సంవత్సర కాలంలో పోరాడి నిలబడాల్సిన వైసీపీ ఇంకా అయోమయంలో పడిందా అంటే అవుననే టాక్ వినిపిస్తోంది. ఆ పార్టీ తప్పుల మీద తప్పులు చేస్తుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది.ఎప్పుడు నిరసనలు చేయాలో..ఏ విషయంలో ఎప్పుడు ఎలా స్పందించాలో ఆలోచించకుండా..అడ్డగోలు నిర్ణయాలు, ఇష్టం వచ్చిన స్టేట్‌మెంట్లతో ఫ్యాన్ పార్టీ ఇంకా ఇరకాటంలో పడుతుందన్న ఒపీనియన్స్ వ్యక్తం అవుతున్నాయి. ఏ విషయంలో అయితే ఎక్కువగా గెలుకోకూడదో..అలాంటి ఇష్యూల్లోనే వైసీపీ అధినేత, ఆ పార్టీ నేతలు అవసరానికి మించి మాట్లాడుతుండటం..ఫ్యాన్ పార్టీ క్యాడర్, లీడర్లను గందరగోళంలోకి నెట్టేస్తుందట. మామూలుగా అయితే అపోజిషన్‌లోకి వచ్చాక పార్టీ బలపడటం చూస్తుంటాం.కానీ వైసీపీ మాత్రం రివర్స్ గేర్‌లో వెళ్తుందన్న టాక్ వినిపిస్తోంది. ప్రతిపక్షం నుంచి బలపడి అధికారం దిశగా ఎదగాల్సిన వైసీపీ..అమరావతి డిబేట్ ఇష్యూను సమర్థించుకునే ప్రయత్నంతో ఇంకా ఇంకా కార్నర్ అయిపోయే పరిస్థితి కనిపిస్తోంది.లేటెస్ట్ కాంట్రవర్సీ అమరావతి దేవతల రాజధాని కాదు..మరో విధమైన రాజధాని అంటూ ఓ సీనియర్ జర్నలిస్ట్ కామెంట్ చేయడం..ఆ డిస్కస్ హోస్ట్‌గా ఉన్న మరో సీనియర్ జర్నలిస్ట్ దానిని వెంటనే ఆపకపోవడం ఇప్పుడు పెద్ద ఎత్తున విమర్శలకు, కేసులకు కారణమైంది.ఆ జర్నలిస్ట్ చేసిన కామెంట్స్ దుమారం లేపుతున్నాయంటే..వైసీపీ ముఖ్యనేత సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన కామెంట్స్ మరింత ఇష్యూ అవుతున్నాయి. పిశాచాలు కూడా ఇలా చేయరేమో.? వారిని రాక్షసులు అని కూడా అనలేం. అందరూ కలిసి సంకరం అయినట్టుంది. ఇవన్నీ కలిసి తయారైన తెగ ఏదో ఒకటున్నట్టుంది. ఆ తెగ పూనుకుంటే మాత్రమే ఇలా చేయగలదు అంటూ సజ్జల చేసిన కామెంట్స్ దుమారం లేపుతున్నాయి.సజ్జలపై చర్యలు తీసుకోవాలని డీజీపీకి ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఫిర్యాదు చేయడంతో - మిగతా3లో



## జీ-7 సదస్సుకు హాజరుకానున్న ప్రధాని

- సైప్రస్, కెనడా క్రొయేషియా దేశాలలో ఐదురోజులపాటు పర్యటించనున్నారు
- కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారికంగా వెల్లడి
- దాదాపు రెండు దశాబ్దాల తరువాత అక్కడ పర్యటించనున్న మోదీనే



## నో పవర్.. నో థ్రస్ట్.. గోయింగ్ డౌన్..

- ప్రమాదానికి ముందు పైలెట్ చివరి మాటలు ఇవే..
- 'విమానంలో పవర్ లేదు. నో థ్రస్ట్.
- థ్రస్ట్ అంటే విమానాన్ని ముందుకు నడిపే శక్తి
- ఇది విమానం ఇంజిన్‌లు లేదా ప్రొపెల్లర్‌ల ద్వారా ఉత్పత్తి అవుతుంది



## ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి

- ముగ్గురు మహిళలు ఉన్నారని పోలీస్ ఉన్నతాధికారుల వెల్లడి
- బాలాఘాట్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారంటూ సమాచారం
- ఛత్తీస్‌గఢ్‌లోని అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు నిరంతరాయంగా కూంబింగ్



## సమస్యలపై గొంతెత్తితే...
## దృష్టి మళ్లించే ప్రయత్నం దుర్మార్గం: జగన్

**స్వర్ణసాగరం అమరావతి**

'రైతుల సమస్యలపై గొంతెత్తితే దాన్ని డైవర్ట్ చేయడానికి చంద్రబాబు ప్రయత్నం చేయడం దుర్మార్గం. పొదిలి కార్యక్రమానికి వచ్చిన రైతులను, ప్రజలను రౌడీలుగా అభివర్ణించడం దిగజారుడుతనం' అని వైసీపీ అధినేత జగన్ అన్నారు. శనివారం ఆయన ఎక్స్ వేదికగా పొదిలి ఘటనలో పోలీసులు పెట్టిన కేసులపై స్పందించారు. 'పొగాకు రైతులకు భరోసా ఇవ్వడానికి నేను పొదిలి వెళ్తే కార్యక్రమానికి సంఘీభావంగా సుమారు 40 వేల మంది ప్రజలు, రైతులు వచ్చారు. మేం వెళ్తున్న మార్గంలో చంద్రబాబు 40 మంది టీడీపీ కార్యకర్తలను పెట్టి, వారిని ఉసిగొల్పి, రాళ్లు విసిరి గలాటా చేయించారు. ప్రజలు, రైతులు ఆ పన్నాగాన్ని అర్థం చేసుకుని అత్యంత సంయమనంతో వ్యవహరించారు. అలాకాకుండా 40 వేల మంది ప్రతిస్పందించి ఉంటే ఏం జరిగి ఉండేది చంద్రబాబు గారూ? పైగా ఉల్టా రైతులపై, ప్రజలపై కేసులు పెడతారా? రోమ్ చక్రవర్తి ఫిడేలు వాయించినట్లు... ఆ రైతుల సమస్యలను పట్టించుకోకుండా తిరిగి వారిపైనే ఎదురు కేసులు పెట్టడం మీకు మాత్రమే చెల్లుతుంది' అని జగన్ విమర్శించారు.

- జీరో కరెప్షన్ లక్ష్యంగా ఏపీ..
- ఎవరు అవినీతికి పాల్పడినా సహించం
- ఆరోపణలు వస్తే తక్షణ విచారణ..
- రుజువైతే ఆ వెంటనే చర్యలు తప్పవు
- ఐవీఆర్ఎస్ ప్రజాభిప్రాయ సేకరణపై సమీక్షలో చంద్రబాబు స్పష్టీకరణ
- 175 నియోజకవర్గాల్లో జాబ్ మేళాలు..
- ఆగస్టు 15 నాటికి అన్ని సేవలూ వాట్సాప్ గవర్నెన్స్
- 10 ముఖ్య సమస్యలపై దృష్టిపెట్టి పరిష్కరించాలని సీఎం దిశానిర్దేశం
- కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై అత్యధిక శాతం ప్రజలు సంతృప్తి




**స్వర్ణసాగరం అమరావతి:**

'జీరో కరెప్షన్' లక్ష్యంగా రాష్ట్రంలో పాలనా వ్యవస్థను నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఏ శాఖలో ఎవరు అవినీతికి పాల్పడినా సహించేది లేదని హెచ్చరించారు. ఎక్కడ అవినీతి జరుగుతుందో అక్కడ ప్రధానంగా దృష్టి పెట్టి విచారణ జరపాలని, అవినీతి రుజువైతే తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏడాది పాలనపై ప్రజల నుంచి .. వివిధ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై వ్యక్తమైన అభిప్రాయాలపై శనివారం ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వంపై అత్యధిక స్థాయిలో సంతృప్తి వ్యక్తమైనట్టు ఐవీఆర్ఎస్, సీఎసడీఎస్ అభిప్రాయ సేకరణలో వెల్లడైందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రజాభిప్రాయ సేకరణపై టెక్నికల్ ఆడిటింగ్ జరపాలని, సమస్యలు ఉన్న చోట సంతృప్తి పెంచేలా చూడాలని చంద్రబాబు ఆదేశించారు. సంక్షేమం, ఉద్యోగాల కల్పన, రహదారులు వంటి 10 ముఖ్యమైన ప్రజా సమస్యలకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చి.. వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వర్క్ ఫ్రమ్ హోమ్ వివరాలతో పాటు పెట్టుబడుల రాక, నైపుణ్య శిక్షణతో ఎంతమందికి ఉద్యోగాలు వచ్చాయో తెలియజేయాలని ఆదేశించారు. 175 నియోజకవర్గాల్లో జాబ్ మేళాలు నిర్వహించడంతో పాటు ఆగస్టు 15 కల్లా అన్ని సేవలను వాట్సాప్ గవర్నెన్స్ (మన మిత్ర) ద్వారా అందించాలని తెలిపారు. మరోవైపు దివ్యాంగులు, వృద్ధులకు రేషన్ సరుకులు ఇంటికి తీసుకువెళ్లి అందించే ప్రక్రియ మరింత మెరుగ్గా జరిగేలా ఆలోచన చేయాలని అధికారులను ఆదేశించారు. చౌకధరల దుకాణాలను పెంచడం, నగదు లేదంటే కూపన్లు ఇవ్వడం వంటి ప్రత్యామ్నాయాలపై లబ్ధిదారుల అభిప్రాయాలు తీసుకోవాలంటూ సీఎం దిశానిర్దేశం చేశారు. ఉచిత ఇసుక విధానం అమలులో ఇసుక లేని చోట్ల సంతృప్తి, ఇసుక ఉన్న చోట అసంతృప్తి ఉండటంపై ప్రాంతాల వారీగా అధ్యయనం చేయాలని చెప్పారు.

**ప్రజాభిప్రాయం ఇలా..**

**పింఛన్ల పంపిణీలో అవినీతి లేదని 85 శాతం మంది, ఇంటి దగ్గరే ఇస్తున్నారని 87.80 శాతం, ఉద్యోగుల ప్రవర్తన బాగుందని 83.90 శాతం మంది ఐవీఆర్ఎస్ ద్వారా తెలిపారు.** - 2లో


# మంత్రి లోకేశ్‌పై ఆరోపణలు నిరూపిస్తే రాజీనామా చేస్తా.




- జగన్ కు మంత్రి సవిత సవాల్
- ఇంట్లో అందరి పిల్లలకూ 'తల్లికి వందనం' వర్తింపు
- గత ప్రభుత్వం కంటే అదనంగా రూ.3,205 కోట్లు కేటాయింపు
- టీడీపీ ప్రభుత్వాలతోనే విద్యకు ప్రాధాన్యం : మంత్రి సవిత

**స్వర్ణసాగరం అమరావతి**

తల్లికి వందనం పథకం అమలుతో పేద విద్యార్థుల ఇళ్లలో ఆనందం వ్యక్తమవుతోందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళిశాఖ మంత్రి ఎస్.సవి తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చడంతో, జగన్ రెడ్డి, ఆయన పార్టీ నాయకులకే ఓర్వలేకపోతున్నారని, మంత్రి నారా లోకేశ్ పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. మంత్రి లోకేశ్ పై చేసిన ఆరోపణలు నిరూపిస్తే తాను మంత్రి పదవితో పాటు ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేస్తానని, లేకుంటే పులివెందుల ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తారా..? అని జగన్ ను మంత్రి సవిత సవాల్ విసిరారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాల అమలులో భాగంగా ముఖ్యమైన తల్లికి వందనం పథకాన్ని సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. ముందుగానే చెప్పిన విధంగా పాఠశాలలు ప్రారంభం రోజున ఈ పథకానికి సీఎం చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారన్నారు. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి ఈ పథకం వర్తింపజేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తల్లికి వందనం పథకం కింద అర్హులైన 67,27,164 మంది విద్యార్థులను గుర్తించామన్నారు. వారందరికీ రూ.10,091 కోట్లు వెచ్చించామన్నారు. ఒక్కో విద్యార్థికి రూ.13 వేల చొప్పున రూ.8,745 కోట్లను నేరుగా వారి తల్లుల ఖాతాలో - మిగతా2లో



## 'దాడులు కొనసాగితే.. టెహ్రాన్ శిథిలమవుతుంది'

- ఇజ్రాయెల్ రక్షణ మంత్రి హెచ్చరిక
- పౌర నివాసాలపై దాడులు చేసి..వారికి హాని తలపెట్టాలని చూస్తే..ఆ దేశం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది
- టెహ్రాన్‌పై దాడులకు వైమానిక దళం సిద్ధం: ఐడీఎఫ్

మాకలం - సామాన్యుడి బలం
RNI No: APTEL/2020/1906
స్వర్ణసాగరం
జాతీయ తెలుగు దినపత్రిక



# విమాన ప్రమాదంలో.. ఏమాత్రం చెక్కు చెదరని 'భగవద్గీత'

అహ్మదాబాద్‌లో జూన్ 12న జరిగిన ఎయిరిండియా విమాన దుర్ఘటన.. ఎంతో మంది కుటుంబాల్లో తీరని విషాదాలు నింపింది. ప్రమాద సమయంలో 230 ప్రయాణికులతో పాటు ఇద్దరు పైలెట్లు, 10 మంది సిబ్బంది ఉండగా.. ఒకే ఒక్క ప్రయాణికుడు సజీవంగా బయటపడి మృత్యుంజయుడయ్యాడు. విమాన ప్రయాణికులు సజీవ దహనమైపోవటంతో పాటు విమానం కూలిన భవనంలోని వాళ్లు ప్రాణాలు కోల్పోవటం.. దేశం మొత్తాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. అయితే.. ఈ దుర్ఘటనలో కన్నీటి కథలు.. ఎన్నో భావోద్వేగ గాథలు వెలుగుచూస్తూ గుండెల్ని మెలిపెడుతున్నాయి. ఇలాంటి సమయంలోనే.. నెట్టింట ఓ వీడియో తెగ వైరల్ అయ్యింది. విమాన ప్రమాదం జరిగిన స్థలంలో భగవద్గీత దొరికిందని.. విమానం మొత్తం కాలిబూడిదైనా ఆ పుస్తకం మాత్రం చెక్కుచెదరకుండా అలాగే ఉంది అంటూ సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ అయ్యాయి . అయితే.. ఇంత పెద్ద బ్లాస్ట్ జరిగి మనుషులంతా కాలి సజీవ దహనమైతే.. భగవద్గీత మాత్రం కాలిపోకుండా ఎలా ఉంది అనే కుతూహలం ఒకవైపు వ్యక్తమవుతుంటే.. మరోవైపు, అసలు ఆ భగవద్గీత ఎవరిదీ..? ఫ్లైట్‌లో ఎందుకుంది..? అని ప్రశ్నలు మొదలయ్యాయి. సాగర్ అమీన్ అనే వలంటీర్ విమాన ప్రమాదం గురైన స్థలంలో శిథిలాల తొలగింపు జరుగుతుండగా ఆ భగవద్గీతను కనిపెట్టారు. ఈలోపు.. ఆ గ్రంథం ఎవరనేదానిపై రకరకాల కథనాలు తెర మీదకు వస్తున్నాయి. ఆ భగవద్గీత జయశ్రీ పటేల్(27)కు చెందిందన్నది ఓ ప్రముఖ ఆంగ్ల వెబ్ సైట్ కథన సారాంశం.





అందులోని వివరాల ప్రకారం.. గుజరాత్ ఆరావళి జిల్లా కంభిసర్‌కు చెందిన జయశ్రీ పటేల్ శ్రీకృష్ణుడి పరమ భక్తురాలు. ఎప్పుడూ ఆమె తన వెంట కృష్ణుడి చిన్న విగ్రహం, భగవద్గీతను తీసుకెళ్తుందట. ఈ ఏడాది జనవరిలో ఆమెకు వివాహం అయ్యింది. భర్త లండన్‌లో ఉద్యోగం. దీంతో ఆమె అక్కడికి బయల్దేరింది. అలా వివాహం అయిన మొదటిసారి.. ఆమె ప్రయాణంలోనూ వాటిని తీసుకెళ్లిందని, ప్రమాదంలో మరణించిందని ఆమె కుటుంబ సభ్యులు కన్నీళ్లతో చెప్పినట్లు ఆ ఆంగ్ల మీడియా కథనం ఇచ్చింది. మరోవైపు ఆ భగవద్గీత ఓ ఎయిర్‌హోస్టెస్‌దంటూ మరో కథనం వైరల్ అవుతోంది.

# నో పవర్.. నో థ్రస్ట్.. గోయింగ్ డౌన్

అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్‌పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి లండన్‌కు బయల్దేరిన ఎయిరిండియా విమానం కొన్ని సెకెన్లలోనే కూలిపోయిన సంగతి తెలిసిందే. విమానం కూలిపోక ముందు కాక్‌పిట్‌లో ఏం జరిగింది అనేది మాత్రం ఇంకా పూర్తిగా బయటకు రాలేదు అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్‌పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి లండన్‌కు బయల్దేరిన ఎయిరిండియా విమానం కొన్ని సెకెన్లలోనే కూలిపోయిన సంగతి తెలిసిందే. విమానం కూలిపోక ముందు కాక్‌పిట్‌లో ఏం జరిగింది అనేది మాత్రం ఇంకా పూర్తిగా బయటకు రాలేదు అయితే విమానం కూలిపోయే సమయంలో ఏటీసీతో పైలెట్ మాట్లాడిన మాటలు ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారాయి. ఏటీసీతో ఎయిరిండియా పైలెట్ చివరి సంభాషణ వైరల్ అవుతోంది. 'విమానంలో పవర్ లేదు. నో థ్రస్ట్. గోయింగ్ డౌన్.. మేడే.. మేడే.. మేడే..' అని పైలెట్ సుమత్ ఏటీసీకి చెప్పారు. ఈ సంభాషణ ఏటీసీలో రికార్డు అయింది. థ్రస్ట్ అంటే విమానాన్ని ముందుకు నడిపే శక్తి. ఇది విమానం ఇంజిన్‌లు లేదా ప్రొపెల్లర్‌ల ద్వారా ఉత్పత్తి అవుతుంది. థ్రస్ట్ అనే పదానికి తెలుగులో నెట్టడం అనే అర్థం కూడా ఉంది. దీంతో ఈ విమాన ప్రమాదంలో ఇంజిన్ లేదా ప్రొపెల్లర్‌ల వైఫల్యం కీలక పాత్ర పోషించినట్టు అర్థమవుతోంది. మొత్తం 242 మంది ప్రయాణికులతో వెళ్తున్న విమానం ఒక్కసారిగా కూలిపోయి మంటల్లో చిక్కుకుంది. భారీ ప్రాణనష్టం సంభవించింది. విమానం ఓ మెడికల్ కాలేజ్ మీద పడింది. ఈ దుర్ఘటనలో మృతుల సంఖ్య 274కు చేరింది. ఈ ప్రమాదంపై కేంద్ర పౌరవిమాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు శనివారం ఢిల్లీలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ ఘటనపై దర్యాప్తునకు ఆదేశించారు.ద



**మే డే కాల్‌కు శతాబ్ధానికి పైగా చరిత్ర!**

సివిల్ ఏవియేషన్ రంగంలో మేడే అనే పదాన్ని మొదట 1920లో వాడారు. లండన్‌లోని క్రోయ్‌డన్ విమానాశ్రయంలో రేడియో ఆఫీసర్‌గా పనిచేసిన ఫ్రెడరిక్ స్టాన్లీ మాక్‌ఫోర్డ్ ఈ పదాన్ని మొదట ఉపయోగించినట్లు రికార్డుల్లో ఉంది. ఇది ఫ్రెంచ్ పదమైన మైడెర్‌కు సమానార్ధకం. ఫ్రెంచ్‌లో మైడెర్ అంటే సహాయం చేయండి (హెల్ప్ మీ) అని అర్థం. 1923 నుంచి అంతర్జాతీయ రేడియో కమ్యూనికేషన్ వాడే పైలట్లు, సముద్రయానం చేసే మెరైన్ సిబ్బంది ఈ మేడే పదాన్ని వాడటం మొదలుపెట్టారు. అధికారికంగా మాత్రం సివిల్ ఏవియేషన్ రంగం 1927 నుంచి ఈ పదాన్ని స్వీకరించింది. అత్యవసర సమయాల్లో మేడేతోపాటు ఎస్‌ఓఎస్ పదాన్ని కూడా వాడుతుంటారు. కానీ, మేడే పదమే బాగా ప్రాచుర్యంలో ఉంది.

**మేడే కాల్ వస్తే..!**

ఎవరైనా పైలట్ నుంచి ఏటీసీకి మేడే కాల్ వచ్చిందంటే ఆ విమానం కూలిపోయే ప్రమాదంలో ఉందని అర్థం. వెంటనే ఏటీసీ అధికారులు అత్యవసరం కాని సేవలన్నింటినీ నిలిపేసి ఆ విమానాన్ని కాపాడేందుకు ప్రయత్నం మొదలు పెడతారు. సహాయం కోసం మేడే కాల్ ఇచ్చిన పైలట్ తన విమానం ఏ ప్రాంతంలో ఉంది? ఎంత ఎత్తులో ఉంది? ఎలాంటి ప్రమాదంలో ఉంది? విమానంలో ఎంతమంది ప్రయాణిస్తున్నారు అనే విషయాలు కూడా అందించాల్సి ఉంటుంది. దాన్ని బట్టి సహాయ చర్యలు ఎలా చేపట్టాలన్నది ఏటీసీ అధికారులు నిర్ణయిస్తారు. ఈ మేడే సిగ్నల్‌ను సాధారణంగా 121.5 మెగాహెడ్జ్, 243 మెగాహెడ్జ్‌లో పంపుతుంటారు. ఈ ఫ్రీక్వెన్సీలను ఏటీసీ అధికారులు అనుక్షణం పరిశీలిస్తుంటారు. కాగా, జూన్ 12వ తేదీ మధ్యాహ్నం లండన్ వెళ్లాల్సిన ఎయిరిండియా విమానం టేకాఫ్ అయిన కాసేపటికే కూలి.. పేలిపోయింది. ఘటనలో విమానంలో ప్రయాణికులు, సిబ్బందితో పాటు జనావాసాలపై కూలి మరో 24 మంది మొత్తం 265 మంది మరణించారు. విమానంలోని ఒకే ఒక్క ప్రయాణికుడు ప్రాణాలతో బయటపడ్డాడు. ప్రమాదానికి కారణాలను తెలుసుకునేందుకు ఈ కేసును ప్రత్యేక బృందం దర్యాప్తు జరుపుతోంది.

# అక్రమ వలసదారులు.. వెనక్కి తగ్గిన ట్రంప్?

అమెరికావ్యాప్తంగా అక్రమ వలసదారుల కోసం కొనసాగుతున్న తనిఖీలు.. అరెస్టులు ఒక్కసారిగా నిలిచిపోయాయి. ఈ విషయంలో కోర్టు పరోక్షంగా ప్రభుత్వ చర్యలకు మద్దతు ప్రకటించింది. అయినప్పటికీ లాస్ ఏంజెల్స్ నిరసనలతోనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెనక్కి తగ్గినట్లు సమాచారం. అక్రమ వలసదారుల్ని గుర్తించి వెనక్కి పంపించేందుకు ట్రంప్ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఈ క్రమంలో బలవంతపు తనిఖీలు, అరెస్టులు చోటు చేసుకుంటున్నాయి. ఈ పరిణామంతో లాస్ ఏంజెల్స్‌లో ఉవ్వెత్తున నిరసన జ్వాలలు ఎగసిపడ్డాయి. క్రమంగా అవి మిగతా ప్రాంతాలకు విస్తరించాయి. అయితే తాజాగా.. హోటళ్లు, రెస్టారెంట్‌లు, వ్యవసాయ సంబంధిత పరిశ్రమల్లో సోదాలను ఆపేయాలంటూ ఇమ్మిగ్రేషన్ – కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కి ఆదేశాలు వెళ్లాయి. ఈ విషయాన్ని న్యూయార్క్ టైమ్స్ ప్రముఖంగా ప్రచురించగా.. ముగ్గురు ఉన్నత అధికారులు సైతం ధృవీకరించారు. అంతకు ముందు.. ట్రంప్ గురువారం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ "వలసదారులు ఎక్కువగా పనిచేస్తున్న ఈ ప్రాంతంలో వ్యాపార కార్యకలాపాలకు ఆటంకం కలగకుండా త్వరలోనే ఓ ఉత్తర్వును జారీ చేస్తాను" అన్నారు. ఈ నేపథ్యంలో లాస్‌ఏంజెలెస్ ప్రాంతంలోని వ్యవసాయ పరిశ్రమలు, హోటళ్లు, రెస్టరంట్‌లలో సోదాలు నిలిపివేయాలని ఆయన ఆదేశించినట్లు తెలుస్తోంది. అక్రమ వలసదారులను అరెస్టు చేసేందుకు ఐసీఈ అధికారులు గత శుక్రవారం లాస్‌ఏంజెల్స్‌లోని డౌన్‌టౌన్‌లో సోదాలు ప్రారంభించడంతో





ఈ నిరసనలు ప్రారంభమయ్యాయి. క్రమంగా దేశమంతటా విస్తరిస్తుండడంతో .. లాస్‌ఏంజెల్స్‌లో భారీస్థాయిలో నేషనల్ గార్డ్‌లను మోహరింపునకు ట్రంప్ ఆదేశించారు. దీంతో ఉద్రిక్తతలు మరింత తీవ్రతరమయ్యాయి. ఈ నేపథ్యంలో నిరసనకారులను అడ్డుకునేందుకు మరో 2వేల మంది నేషనల్ గార్డులను మోహరించాలని ట్రంప్ ఆదేశాలు జారీ చేశారు. ట్రంప్ చర్యలను కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్, లాస్ ఏంజెలెస్ మేయర్ కరెన్ బాస్‌తోపాటు స్థానిక పోలీసు అధికారులు వ్యతిరేకించారు. గవిన్ దీనిపై ఫెడరల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. అధ్యక్షుడి ఆదేశాలు చెల్లవని న్యాయస్థానం తేల్చిచెప్పింది. అయితే.. ఫెడరల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వును తొమ్మిదో యూఎస్ సర్క్యూట్ కోర్టు ఆఫ్ అప్పీల్స్ తాత్కాలికంగా నిలిపివేసింది. ట్రంప్ నిర్ణయానికి పరోక్షంగా మద్దతు పలికింది. కోర్టు నిర్ణయంతో నేషనల్ గార్డు సిబ్బందికి అడ్డంకి తొలగిపోగా.. నిరసనకారులను ఎక్కడికక్కడ అరెస్టు చేయాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఆపై ఈ నిర్ణయానికి తాత్కాలిక బ్రేక్ వేస్తూ మళ్లీ ఉత్తర్వులు జారీ చేసింది.

## జీ-7 సదస్సుకు హాజరుకానున్న ప్రధాని



**ఢిల్లీ:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. సైప్రస్, కెనడా క్రొయేషియా దేశాలలో ఐదురోజులపాటు పర్యటించనున్నారని కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ శనివారం అధికారికంగా వెల్లడించింది. సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడోలైడ్స్ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ ఆ దేశంలో జూన్ 15–16 తేదీల్లో పర్యటించనున్నారు. ఎపర్యటనలో భాగంగా సైప్రస్ అధ్యక్షుడితో ఆయన చర్చలు జరపనున్నారు. దీనితోపాటు వ్యాపారవేత్తలను ఉద్దేశించి కీలక ప్రసంగం చేయనున్నారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింతగా పెంచుకోవడం, మధ్యధరా ప్రాంతంతో భారత్ సంబంధాల బలోపేతం, యూరోపియన్ యూనియన్‌లతో సంబంధాలను మరింత పటిష్టం చేసే విధంగా ఇరు దేశాల మధ్య ఒప్పందాలు జరగనున్నాయి. అక్కడి నుంచి ప్రధాని మోదీ నేరుగా కెనడాకు వెళ్తారు. ఆ దేశ ప్రధాని మార్క్ కార్నీ ఆహ్వానం మేరకు జూన్ 16–17న కననాస్కిస్‌లో జరగనున్న జీ–7 సదస్సుకు హాజరుకానున్నారు. ఈ సదస్సులో ప్రధాని మోదీ పాల్గొనడం వరుసగా ఆరోసారి. ఇందులో భాగంగా జీ–7 దేశాధినేతలతో సమావేశం కానున్నారు. జీ–7 దేశాలలోని అంతర్జాతీయ సంస్థల అధిపతులతో ఇంధన భద్రత, కీలక అంతర్జాతీయ సమస్యలు, సాంకేతికత, ఆవిష్కరణలు, ముఖ్యంగా ఏఐతో అనుసంధానం, క్వాంటమ్ సంబంధిత అంశాల గురించి చర్చలు జరపనున్నారు. ప్రయాణంలో భాగంగా జూన్ 18న మోదీ ఐరోపాలోని క్రొయేషియాకు వెళ్లనున్నారు. ఆ దేశంలో భారత ప్రధాని పర్యటించడం ఇదే తొలిసారి.

## ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి



**భోపాల్ :** మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లాలో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో ముగ్గురు మహిళలు ఉన్నారని పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు. బాలాఘాట్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారంటూ నిఘా వర్గాల నుంచి పోలీసులు, భద్రతా దళాలకు సమాచారం అందింది. దీంతో ఆ అటవీ ప్రాంతంలో వారు సంయుక్తంగా కూంబింగ్ నిర్వహించారు. ఆ క్రమంలో భద్రతా బలగాలను మావోయిస్టులు గమనించడంతో.. వారిపైకి కాల్పులకు తెగబడ్డారు. దీంతో భద్రతా బలగాలు వెంటనే ఎదురు కాల్పులు జరిపాయి. మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లోని అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు నిరంతరాయంగా కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఆ క్రమంలో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో వందల మంది మావోయిస్టులు మృతి చెందారు. వారిలో అగ్రనేతలు సైతం ఉన్నారు. అయితే ఈ కూబింగ్‌ను తట్టుకోలేక కొందరు మావోయిస్టులు సరిహద్దు రాష్ట్రమైన మధ్యప్రదేశ్‌లోని పలు జిల్లాలోకి మావోయిస్టులు ప్రవేశించారంటూ నిఘా వర్గాల వద్ద స్పష్టమైన సమాచారం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆ యా జిల్లాల్లో భద్రతా బలగాలు కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఇంకోవైపు 2026, మార్చి మాసాంతానికి దేశంలో మావోయిస్టులను నిర్మూలిస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్పష్టమైన ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో వారి నిర్మూలన కోసం కేంద్రం వ్యూహాత్మకంగా ఆడుగులు వేస్తోంది. అయితే తాము చర్చలకు సిద్ధమని ఈ నేపథ్యంలో ఆపరేషన్ కగార్ ఆపాలంటూ మవోయిస్టులు చేసిన విన్నపాన్ని అటు కేంద్ర ప్రభుత్వం కానీ ఇటు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కానీ పరిగణలోకి తీసుకోకపోవడం గమనార్హం.

## 'దాడులు కొనసాగితే.. టెహ్రాన్ శిథిలమవుతుంది'



**ఇంటర్నెట్ డెస్క్:** ఆపరేషన్ రైజింగ్ లయన్ పేరుతో ఇరాన్‌లోని అణుస్థావరాలపై ఇజ్రాయెల్ దాడులు చేస్తున్న సంగతి తెలిసిందే. దీంతో ఇరాన్ సైతం ఇజ్రాయెల్‌పై ప్రతిదాడులు చేస్తోంది. తొలుత భారీ సంఖ్యలో డ్రోన్లను టెల్‌అవీవ్‌పైకి పంపిన టెహ్రాన్..ఆ తర్వాత వందల సంఖ్యలో క్షిపణులను ప్రయోగించింది. దీంతో ఆగ్రహానికి గురైన ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కాట్జ్ ఇరాన్‌పై తీవ్రంగా మండిపడ్డారు. ఇరాన్ తమ దేశంపై క్షిపణులను ప్రయోగించడం కొనసాగిస్తే.. టెహ్రాన్ తగలబడిపోతుందని హెచ్చరించారు. పౌర నివాసాలపై దాడులు చేసి..వారికి హాని తలపెట్టాలని చూస్తే..ఆ దేశం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ఖమేనీ తన చర్యలతో తన దేశంలోని ప్రజలను ప్రమాదంలోకి నెట్టేస్తున్నారని అన్నారు.

**టెహ్రాన్‌పై దాడులకు వైమానిక దళం సిద్ధం: ఐడీఎఫ్**

ఇరాన్‌లోని పలు లక్ష్యాలపై తిరిగి దాడులు చేయడానికి తమదేశ వైమానిక దళం సిద్ధంగా ఉందని ఐడీఎఫ్ తెలిపింది. ఈ మేరకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంది. ఇందుకోసం ఐడీఎఫ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఇయాల్ జమీర్, ఇజ్రాయెల్ వైమానిక దళ చీఫ్ మేజర్ జనరల్ టోమర్ బార్ పరిస్థితులను అంచనా వేస్తున్నట్లు సమాచారం. కాగా టెల్‌అవీవ్‌పై టెహ్రాన్ చేస్తున్న దాడుల్లో ముగ్గురు ఇజ్రాయెల్ పౌరులు ప్రాణాలు కోల్పోయారు.

**ఆపరేషన్ రైజింగ్ లయన్.. ఇరాన్ కీలక అధికారులు మృతి**

అమెరికా, ఫ్రాన్స్, యూకే స్థావరాలపై దాడులు చేస్తాం: ఇరాన్

తాము ఇజ్రాయెల్‌పై చేస్తున్న దాడులను ఆపడానికి అమెరికా, యూకే, ఫ్రాన్స్ వంటి దేశాలు ఇజ్రాయెల్‌కు సహకరిస్తే పశ్చిమాసియాలోని ఆయా దేశాల స్థావరాలను, నౌకలను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ హెచ్చరించింది. తమపై దాడులకు పాల్పడుతున్న టెల్‌అవీవ్‌కు వాషింగ్టన్ మద్దతునిస్తుందని ఇప్పటికే ఇరాన్ అధికారులు ఆరోపించిన విషయం తెలిసిందే. కాగా అవన్నీ తప్పుడు ప్రచారాలని అగ్రరాజ్యం కొట్టిపడేసింది. ఆపరేషన్ 'రైజింగ్ లయన్' పేరుతో ఇరాన్‌పై ఇజ్రాయెల్ గురువారం అర్ధరాత్రి భీకరమైన దాడులు చేసింది. ఈ దాడుల్లో ఇరాన్‌కు చెందిన పలు కీలక మిలిటరీ అధికారులు, అణుశాస్త్రవేత్తలు మృతి చెందారు. దీనికి ప్రతీకారంగా ఇరాన్ కూడా భారీ దాడులకు దిగింది. శుక్రవారం అర్ధరాత్రి టెల్ అవీవ్, జెరూసలెం లక్ష్యంగా ఇరాన్ మిస్సైళ్లతో విరుచుకుపడింది. ఆయా ప్రాంతాల్లో డజన్ల కొద్దీ క్షిపణి దాడులు చేసింది. శనివారం ఇరుదేశాలు మళ్లీ ఒకదానిపై ఒకటి డ్రోన్లతో విరుచుకుపడ్డాయి

మా కలం - సామాన్యుడి బలం
RNI No: APTEL/2020/1906
స్వర్ణసాగరం
జాతీయ తెలుగు దినపత్రిక



# మంత్రి లోకేశ్ పై ఆరోపణలు నిరూపిస్తే.. రాజీనామా చేస్తా...

-మొదటిపేజీ తరువాయి




జమచేశామన్నారు. మిగిలిన రూ.2 వేలు చొప్పున రూ. రూ.1,346 కోట్లను పాఠశాలల అభివృద్ధికి కేటాయించామన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ తల్లికి వందనం పథకాన్ని అమలు చేశారని మంత్రి సవిత వెల్లడించారు. ఒకరుంటే రూ.13 వేలు, ఇద్దరుంటే రూ.26 వేలు, ముగ్గురుంటే రూ.39 వేలు, నలుగురుంటే రూ.52 వేలు, అయిదుగురుంటే రూ.65 వేలు తల్లుల ఖాతాలో జమ చేశామన్నారు. సత్య సాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం పరిగి పట్టణానికి చెందిన అంజనప్ప, ఈశ్వరమ్మ దంపతులకు అయిదురు సంతానం ఉంటే, వారందరికీ కలిపి రూ.65 వేల జమయ్యాయని తెలిపారు. అదే జిల్లా రొద్దం గ్రామానికి చెందిన ఒకే కుటుంబంలో నలుగురు విద్యార్థులకు రూ.52 వేలు జమయ్యాంటూ ఓ పత్రికలో వచ్చిన కథనాన్ని చూపారు. ఇంట్లో ఎంతమంది విద్యార్థులుంటే వారందరికీ తల్లికి వందనం పథకం కింద డబ్బులు జమ కావడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తంచేస్తున్నారన్నారు. ఫోన్లు చేసి సీఎం చంద్రబాబుకు, మంత్రి లోకేశ్ కు ధన్యవాదాలు చెబుతున్నారని మంత్రి సవిత తెలిపారు.

### వైసీపీ కంటే అదనంగా రూ.3,205 కోట్లు కేటాయింపు

తల్లి ప్రేమకు జగన్ పరిమితి పెడితే, తమ ప్రభుత్వం తల్లి ప్రేమకు హద్దుల్లేకుండా తల్లికి వందనం పథకం అమలు చేస్తోందని మంత్రి సవిత వెల్లడించారు. 2019 ఎన్నికల్లో ఇద్దరు పిల్లలకు అమ్మఒడి పథకం అందజేస్తామని జగన్ రెడ్డి హామీ ఇచ్చి, మాటతప్పారని మండిపడ్డారు. ఇంట్లో ఇద్దరకు ముగ్గురు పిల్లలున్నా కేవలం ఒకరికి మాత్రమే అమ్మఒడి పథకం కింద రూ.13 వేలు అందజేశారన్నారు. 2022-23లో 42,61,965 మంది విద్యార్థులకు మాత్రమే అమ్మఒడి పథకం కింద వర్తింపజేశారన్నారు. వారందకీ అప్పట్లో రూ.5,540 కోట్లు మాత్రమే ఇచ్చారన్నారు. వైసీపీ ప్రభుత్వం కంటే కూటమి ప్రభుత్వంలో అదనంగా 24,65,199 మంది విద్యార్థులకు తల్లికి వందనం పథకం వర్తింప జేశామన్నారు. గత ప్రభుత్వం కంటే అదనంగా రూ.3,205 కోట్లు కేటాయించామన్నారు.

### టీడీపీతోనే విద్యకు ప్రాధాన్యం

రాష్ట్రంలో విద్యా వ్యవస్థ అభివృద్ధికి టీడీపీ ప్రభుత్వాలే వెన్నుదన్నుగా నిలుస్తున్నాయని మంత్రి సవిత గుర్తు చేశారు. తల్లికి వందనం పథకంతో పాటు పాఠశాలల ప్రారంభం రోజున డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర పథకం కింద విద్యార్థులకు కిట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఒక్కో కిట్టు విలువ రూ.2,279లని, ఆ కిట్టులో పాఠ్య పుస్తకాలు, వర్క్, నోట్‌బుక్‌లు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, 3 జతల యూనిఫారం, బ్యాగ్, బూట్లు, 2 జతల సాక్సులు, బెల్ట్ ఉన్నాయని తెలిపారు. విద్యార్థులకు కడుపు నింపడమే కాదు వారి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం పెడుతున్నామన్నారు. పిల్లలు కూడా సంతోషంగా భోజనం చేస్తున్నారన్నారు. గత వైసీపీ హయాంలో పాఠశాలలు, వసతి గృహాలకు, గోదాముల్లో ఎక్కువ రోజులు నిల్వ ఉన్న ముతక బియ్యాన్ని సరఫరా చేశారని తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ పేరుతో మధ్యాహ్న భోజనం పథకం అమలుచేస్తున్నామన్నారు. 2014-19లోనూ ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేశామని, జగన్ రెడ్డి ఆ పథకాన్ని నిలిపేసిన విషయాన్ని మంత్రి సవిత గుర్తు చేశారు.

### లోకేశ్ పై తప్పుడు ఆరోపణలు మానుకో...

తల్లికి వందనం పథకం అమలుతో జగన్ రెడ్డి మైండ్ బ్లాక్ అయ్యిందని, దీంతో లేనిపోని ఆరోపణలు చేస్తున్నాడని మంత్రి సవిత మండిపడ్డారు. తల్లికి వందనం పథకంలోని రూ.2 వేలు మంత్రి లోకేశ్ జేబులోకి వెళ్లాయని తప్పుడు ఆరోపణలు చేయడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. గతంలో మీరు చేసిన అవినీతిని మంత్రి లోకేశ్ పైకి నెట్టడం సరికాదన్నారు. మంత్రి లోకేశ్ పై చేసిన ఆరోపణలు నిరూపిస్తే తాను మంత్రి, ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేస్తానని, లేకుంటే పులివెందుల ఎమ్మెల్యే పదవి రాజీనామా చేస్తావా.. అని జగన్ కు మంత్రి సవాల్ విసిరారు. అబద్ధాలు, తప్పుడు ప్రచారాలు, సానుభూతి పునాదుల మీదే జగన్ రాజకీయ జీవితాన్ని నిర్మించుకుంటున్నాడన్నారు.

### మెగా డీఎస్సీని అడ్డుకోడానికి జగన్ కుట్ర

మహిళలంటే జగన్ కు గౌరవం లేదని, తల్లిని, చెల్లెళ్లను, రాష్ట్రంలో ఆడ బిడ్డలను ఏడిపిస్తున్నాడని మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. మృతదేహాల దగ్గరికి వెళ్లి నవ్వుతాడని, రాష్ట్రంలో సీఎం చంద్రబాబు చేస్తున్న అభివృద్ధిని, సంక్షేమాన్ని చూసి కుళ్లి కుళ్లి ఏడుస్తున్నాడని అన్నారు. కూటమి ప్రభుత్వం టీచర్ పోస్టుల భర్తీకి నిర్వహిస్తున్న మెగా డీఎస్సీని అడ్డుకోడానికి జగన్ కుట్రపన్నాడన్నారు. డీఎస్సీని అడ్డుకోడానికి 24 కేసులు వేశారన్నారు. చివరికి సుప్రీం కోర్టులో కూడా కేసు వేస్తే, దేశ అత్యున్నత న్యాయస్థానం మొట్టికాయలు వేసిందని తెలిపారు. ప్రజలు గట్టి గుణపాఠం చెప్పినా జగన్ రెడ్డికి బుద్ధి రాలేదని మంత్రి సవిత ఎద్దేవా చేశారు.

-మొదటిపేజీ తరువాయి

**సీఎస్‌డీఎస్ ఫీల్డ్ సర్వేలో లబ్ధిదారులను నేరుగా కలిసి ప్రశ్నించగా.. పింఛన్ల పంపిణీలో అవినీతి లేదని 93.90 శాతం, ఇంటి దగ్గరే ఇస్తున్నారని 93.30 శాతం, ఉద్యోగుల ప్రవర్తన బాగుందని 73.30 శాతం మంది చెప్పారు.**

**అన్న క్యాంటీన్లు పరిశుభ్రంగా ఉన్నాయని 89.50 శాతం, ఆహారం నాణ్యత బాగుందని 79.30 శాతం, సమయపాలన పాటిస్తున్నారని 80.80 శాతం మంది ఐవీఆర్ఎస్ ద్వారా చెప్పారు.**

**ఆసుపత్రులలో క్వాలిటీ చెక్‌పపై 68.40 శాతం, రక్త పరీక్షలపై 55 శాతం, ఉచిత మందుల పంపిణీపై 65.5 శాతం, సిబ్బంది ప్రవర్తనపై 71.3 శాతం సంతృప్తి వ్యక్తం చేశారు.**

**మున్సిపాలిటీలలో రోజూ చెత్త సేకరణపై 68.10 శాతం, 24 గంటల్లో చెత్త డంప్ తరలింపుపై 57 శాతం మంది సంతృప్తి చెందారు.**

**ఆలయాల్లో సౌకర్యాలు బాగున్నాయని 63.60 శాతం, దర్శనం బాగుందని 68 శాతం, ప్రసాదం నాణ్యత బాగుందని 77.70% భక్తులు చెప్పారు.**

**ఆర్టీసీ బస్సుల్లో సీటింగ్, శుభ్రతపై 53.40 శాతం, నీటి సౌకర్యంపై 45.20 శాతం, టాయిలెట్స్ నిర్వహణపై 56 శాతం, బస్సుల సమయం-రూటు వివరాలపై 61.50 శాతం, బస్సులు సమయానికి బయల్దేరుతున్నాయని 69 శాతం, సమయానికి గమ్యస్థానాలకు చేరుకుంటున్నాయని 69.70%, సిబ్బంది ప్రవర్తన బాగుందని 72.40 శాతం, భద్రత బాగుందని 69.70% మంది చెప్పారు.**

**నెలనెలా రేషన్ సరుకులు తీసుకుంటున్నామని 75.10 శాతం, సరుకుల నాణ్యత బాగుందని 73.80 శాతం మంది చెప్పారు. దీపం-2 డెలివరీ చార్జీలు వసూలు చేయడం లేదని 62.8 శాతం మంది చెప్పారు.**

**ఎరువుల లభ్యత బాగుందని 60.90 శాతం మంది రైతులు చెప్పారు. సమయానికి విత్తనాల సరఫరా జరిగిందని 63 శాతం మంది తెలిపారు.**




**తమ ప్రాంతాల్లో గంజాయి, డ్రగ్స్ సంబంధిత సమస్య ఉందని 27.40 శాతం మంది చెప్పగా.. పోలీసులు స్పందిస్తున్నారని 54.50 శాతం మంది చెప్పారు. పబ్లిక్ ప్రాంతాల్లో మహిళలపై హింస, వేధింపులు ఉన్నాయని 27.8 శాతం మంది చెబితే.. పోలీసుల స్పందన బాగుందని 59.50 శాతం, పోలీసులు చర్యలు తీసుకుంటున్నారని 56.30 శాతం మంది చెప్పారు.**

**రిజిస్ట్రేషన్ సేవల్లో స్లాట్ బుకింగ్ ప్రాసెసపై 63.40 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేయగా.. అవినీతి లేదని 62.30 శాతం మంది చెప్పారు.**

**ఇసుక రిజిస్ట్రేషన్ ప్రాసెసపై 70.60 శాతం, లభ్యతపై 67.50 శాతం, ధరపై 61.10 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. రెవెన్యూ సేవల్లో ఎఫ్ లైన్‌పై డబ్బులు వసూలు చేయడం లేదని 75.10 శాతం మంది చెప్పారు. విద్యుత్తు నిరంతరాయంగా సరఫరా అవుతోందని 61.60 శాతం మంది చెప్పారు. పంచాయతీల్లో ఇంటింటికీ చెత్తసేకరణ జరుగుతోందని 56.70 శాతం మంది చెప్పారు. ఎన్టీఆర్ వైద్య సేవల పథకం కింద అడ్మిషన్లపై 86.20 శాతం, సేవలపై 81.30 శాతం మంది బాగుందని తెలిపారు.**

## సవాల్ చేస్తే... సౌండ్ ఆఫ్!

### జగన్ ఆరోపణలపై లోకేశ్

'బురద చల్లడం... పారిపోయి ప్యాలెసలో దాక్కోవడం... జగన్‌కు అలవాటు' అని మంత్రి లోకేశ్ ఎద్దేవా చేశారు. 'తల్లికి వందనం డబ్బులు నా జేబులోకి వె ళ్లాయి అంటూ చేసిన ఆరోపణలు 24 గంటల్లో నిరూపించాలని చాలెంజ్ చేశాను. సమయం ముగిసినా రుజువు చేయలే దు. క్షమాపణ కోరలేదు. అందుకే మిమ్మల్ని ఫేక్ అనేది. లీగల్ యాక్షన్‌కు సిద్ధంగా ఉండండి. సమయం లేదు మిత్రమా! శరణమా... న్యాయ సమరమా? తేల్చుకోండి' అంటూ లోకేశ్ సవాల్ చేశారు. టీడీపీ రాష్ట్రస్థాయి నేత నాదెండ్ల బ్రహ్మం స్పందిస్తూ... 'రాష్ట్రం అభివృద్ధి చెందటం జగన్‌కి, అతని కాలకేయ ముఠాకు నచ్చదు.' అని విమర్శించారు.

# కఠినంగా కనిపించినా.. అభిమానమే!

సినీ పరిశ్రమ అభివృద్ధికి సహకరిస్తాం
ప్రభుత్వపరంగా కొన్నిసార్లు కఠిన నిర్ణయాలు
కానీ, మిమ్మల్ని అభిమానంగా చూసుకుంటాం
'తెలంగాణ రైజింగ్-2047' డాక్యుమెంట్‌లో.. ఒక చాప్టర్
సినీ పరిశ్రమకు కేటాయిస్తాం
దానికి తగ్గట్లుగా ప్రణాళికను రచించండి
హాలీవుడ్, బాలీవుడ్ హైదరాబాద్‌కు రావాల్సిందే..
రాష్ట్ర అభివృద్ధిలో మీరు భాగస్వాములు కావాలి
ఇంకా 22 ఏళ్ల క్రియాశీల రాజకీయాల్లో ఉంటా
గద్దరన్న అంటే ఒక చైతన్యం.. ఒక విప్లవం
గద్దర్ అవార్డుల ప్రదానోత్సవంలో సీఎం రేవంత్

**స్వర్ణసాగరం హైదరాబాద్**

"రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా కనిపిస్తుంది. ప్రభుత్వాన్ని నడిపేటప్పుడు కొన్ని నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుంది. కానీ, మిమ్మల్ని అభిమానంగా చూసుకుంటుంది. మీ అభివృద్ధికి నూటికి నూరు శాతం తోడ్పాటునందిస్తుంది. మిమ్మల్ని ప్రోత్సహించడానికి, అభినందించడానికి, మీకు సముచిత స్థానం కల్పించడానికి ప్రయత్నం చేస్తుంది" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సినీ ప్రముఖులను ఉద్దేశించి అన్నారు. తెలంగాణ రాష్ట్రం 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీని సాధించాలన్న లక్ష్యంతో రూపొందిస్తున్న 'తెలంగాణ రైజింగ్-2047' విజన్ డాక్యుమెంట్‌లో ఒక చాప్టర్‌ను సినీ పరిశ్రమకు కేటాయిస్తున్నామని తెలిపారు. దానికి తగినట్లుగా చాప్టర్‌ను రచించాలని సినీ ప్రముఖులకు సూచించారు. శనివారం రాత్రి హైటెక్స్‌లో జరిగిన 'తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డుల' ప్రదానోత్సవ కార్యక్రమంలో సీఎం పాల్గొని మాట్లాడారు. "సుమారు 14 ఏళ్ల తర్వాత తెలంగాణ ప్రభుత్వం ఈ అవార్డుల ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. దీనిని నిర్వహించాలని సినీ ప్రముఖులు, దిల్‌రాజు వంటివారు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఇంత అద్భుతమైన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డిరెడ్డి వెంకట్‌రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి, సినీ ప్రముఖులకు నా అభినందనలు. కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం సినీ పరిశ్రమను గౌరవించి, మీకు అవసరమైన అన్ని వసతులను ఏర్పాటు చేయడమే కాకుండా, మిమ్మల్ని అభినందించాలన్న ఆలోచనతో ఈ అవార్డులను మళ్లీ పునఃప్రారంభించింది" అని రేవంత్ వివరించారు.

**ఆ సంప్రదాయాన్ని కొనసాగించేందుకే..**

తెలుగు సినీ పరిశ్రమను గుర్తించడానికి, డైరెక్టర్లను, నటులను, ఇతర కళాకారులను గుర్తించి అవార్డులు ఇవ్వాలని, ఆ అవార్డులకు నంది పేరు పెట్టాలని 60 ఏళ్ల క్రితం 1964లో ఆనాటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని సీఎం రేవంత్ గుర్తు చేశారు. ఆ సంప్రదాయాన్ని 14 ఏళ్ల క్రితం వరకు ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రులు కొనసాగిస్తూ వచ్చారని తెలిపారు. మొట్టమొదటి నంది ఉత్తమ నటుడి అవార్డును అక్కినేని నాగేశ్వరరావు తీసుకున్నారని, అలాంటి గొప్ప కళాకారుడికి ఆనాటి ప్రభుత్వం సముచిత గౌరవాన్ని ఇవ్వడాన్ని అందరం గుర్తు చేసుకోవాలని అన్నారు. వివిధ కారణాల వల్ల 14 ఏళ్ల క్రితం ఆగిపోయిన ఈ కార్యక్రమాన్ని మళ్లీ కొనసాగించాలన్న ఆలోచనతో తమ ప్రభుత్వం నంది అవార్డులను 'తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డులు'గా ఇస్తోందని పేర్కొన్నారు.. ప్రముఖులంతా ఇక్కడ ఉండి, పరిశ్రమంతా ఒక్కటేనని, పరిశ్రమకు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని ఆహ్వానిస్తున్నామంటూ సమయాన్ని కేటాయించ డాన్ని అభినందిస్తున్నానని తెలిపారు. గతంలో భారతీయ సినీ పరిశ్రమ అంటే బాలీవుడ్ అని చర్చించుకునేవారని, తెలుగు సినీ పరిశ్రమ అంటే చెన్నైలో ఉందని మాట్లాడుకునేవారని అన్నారు. కానీ, ఈనాడు భారతీయ సినీ పరిశ్రమ అంటే తెలుగు సినీ పరిశ్రమ అంటున్నారని తెలిపారు. "తెలుగు సినీ పరిశ్రమకు హైదరాబాద్ వేదిక అని మీరు నిరూపించినందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున మిమ్మల్ని అభినందిస్తున్నా. సినీ పరిశ్రమకు సంబంధించి మొదటి తరమంటే అన్న నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వరరావు. రెండో తరమంటే కృష్ణ, శోభన్‌బాబు, కృష్ణంరాజు. మూడో తరమంటే చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేశ్, నాగార్జున. ఈ రోజు నాలుగో తరం సినీ పరిశ్రమ ఇక్కడ ఉంది. నాలుగో తరంలో పవన్ కల్యాణ్, మహేశ్‌బాబు, అల్లు అర్జున్.. ఇలా వీరి తరం ఇప్పుడు తెలుగు సినీ పరిశ్రమకు ప్రాతినిధ్యం వహిస్తోంది. విద్యార్థి దశలో నాకు పరిచయం ఉన్నవారు సినీ పరిశ్రమలో రాణిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. బన్నీ, వెంకట్, అశ్వనీదత్ అమ్మాయిలు, అల్లుడు నాగ్ అశ్విన్.. వీళ్లందరూ కాలేజ్ డేస్‌లో నాకు తెలుసు. వారందరూ రాణిస్తుండడం పట్ల అభినందిస్తున్నాను" అని రేవంత్ అన్నారు.

**మిమ్మల్ని అభిమానంగా చూసుకుంటాం..**

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 2047 నాటికి వంద సంవత్సరాలు పూర్తి చేసుకోబోతున్న సందర్భంలో ఇతర రంగాల్లాగే సినీ ఇండస్ట్రీ కూడా గొప్ప పరిశ్రమగా రాణించాలన్నదే తమ ప్రభుత్వ ఆలోచన అన్నారు. ఇటీవల జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో.. 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా అభివృద్ధి చెందేలా నడిపిస్తానని ప్రధానమంత్రి మోదీకి చెప్పానన్నారు. అది జరగాలంటే సినీ పరిశ్రమ కూడా గొప్పగా అభివృద్ధి చెందాలన్నారు. "హాలీవుడ్ అంటే అమెరికాకు, బాలీవుడ్ అంటే ముంబైకి వెళుతున్నాం. నేను దర్శకుడు రాజమౌళిని అడుగుతున్నా. ప్రపంచమే గుర్తించేలా అద్భుతమైన సినిమాలు తీయగలిగిన మీరు.. ఆ పరిశ్రమను ఈ గడ్డ మీదకు ఎందుకు తీసుకురావడం లేదు? హాలీవుడ్, బాలీవుడ్ హైదరాబాద్ గడ్డ మీద ఉండాలి. మీకు ఏం కావాలో నాకు చెప్పండి. రాష్ట్ర ప్రభుత్వం మీకు అండగా నిలబడుతుంది. ఐటీ, ఫార్మా, డిఫెన్స్ పరిశ్రమలను ప్రోత్సహించినట్లే సినీ పరిశ్రమను కూడా ప్రోత్సహిస్తాం. ప్రణాళికను మీరు రచించండి. మా 'తెలంగాణ రైజింగ్-2047' విజన్ డాక్యుమెంట్‌లో సినీ పరిశ్రమకు ఒక చాప్టర్ ఇస్తాం. ఆ చాప్టర్‌ను రాయాల్సిన బాధ్యత ఇక్కడున్న సినీ పెద్దలందరిపై ఉంటుంది. మీకు ఏం కావాలో నాకు చెప్పండి. ఇక్కడి నుంచి 22 ఏళ్ల సమయం ఉంది. ఈ 22 ఏళ్లు క్రియాశీల రాజకీయాల్లో నేనుంటా. ఏ హోదాలో ఉన్నా... మీకు అండగా నిలబడతా" అని సీఎం హామీ ఇచ్చారు.

## జగన్ ప్రభుత్వ హయాంలో పెట్టుబడి దారులు పారిపోయారు

-మొదటిపేజీ తరువాయి

చేశామని తెలిపారు. వైసీపీ అమ్మబడికి రూ.15 వేలు ఇస్తామని చెప్పిందని.. పిల్లలందరికీ ఇస్తామని చెప్పి ఒక్కరికే ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రతిపక్షం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. అసెంబ్లీకి రాని ప్రతిపక్ష పార్టీ దేశంలో కేవలం వైసీపీనేనని విమర్శలు చేశారు. తల్లికి వందనంలో రూ. 2 వేలు మంత్రి నారా లోకేష్ జేబులో వేసుకుంటున్నారని వైసీపీ నేతలు అన్నారని.. ఈ విషయంలో లోకేష్ సవాల్‌కి సిద్ధమా అంటే వారు పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. రూ. 34 వేల కోట్లు ఏడాదిలో పెన్షన్ కిందా ఇచ్చామని చెప్పారు. వైసీపీ హయాంలో ఏ పథకాలు ఇచ్చారో తెలుసుకోవాలని అన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి రూ. 1.04లు ఇచ్చామని గుర్తుచేశారు. జగన్ హయాంలో కేవలం రూ.64 వేలు మాత్రమే ఇచ్చారని.. పిల్లల భవిష్యత్ గురించి ఆలోచించారా అని మంత్రి పార్థసారథి ప్రశ్నించారు.

### సూపర్ సిక్స్ పథకాలు అమలు చేశాం...

'కూటమి పాలనలో తల్లికి వందనం, ఫీజ్ రీయింబర్స్‌మెంట్ ఇస్తున్నాం. మా ప్రభుత్వంలో పిల్లలను చదివించి, వాళ్లకు ఉద్యోగాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్నాం. మేము సామాన్యులను ఎక్కడా కేసులు పెట్టి వేధించలేదు. గత వైసీపీ ప్రభుత్వం అవగాహన రాహిత్యంతో పని చేసింది. కూటమి పాలనలో 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాం. పిల్లలకు మంచి భవిష్యత్ ఇస్తాం. ఆ రెండు వేల రూపాయలను పాఠశాలలకు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం ఖర్చు చేస్తాం. అశోక్ లేలాండ్, అమర్ రాజా లాంటి సంస్థలు ఏపీ నుంచి వెళ్లిపోయాయి. గత జగన్ ప్రభుత్వంలో చేసిన రూ.10 లక్షల కోట్ల అప్పులకు.. మా ప్రభుత్వంలో వడ్డీలకే వేల కోట్లు చెల్లిస్తున్నాం. పోలవరాన్ని ధ్వంసం చేశారు. అమరావతి రాజధాని అని మూడు రాజధానులని చట్టం చేసిందే వైసీపీ. పోలవరం ప్రాజెక్టు 2027లోగా పూర్తి చేస్తాం. 87 లక్షల మంది ఉంటే 45 లక్షల మందికే ఎందుకు అమ్మవడి ఇచ్చారు' అని మంత్రి కొలుసు పార్థసారథి ప్రశ్నించారు

## సీఎం చంద్రబాబుతో సినీ పెద్దల భేటీ వాయిదా..!

ఏపీలో థియేటర్‌ల పరిస్థితి.. సదుపాయాలకు సంబంధించి డీటెయిల్ రిపోర్ట్ ఇవ్వాలని సినిమాటోగ్రఫీశాఖ ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు రంగంలోకి దిగి పలు థియేటర్‌లలో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లను సినీ ప్రముఖులు కలవనున్నారు. రాష్ట్ర విభజన జరిగి 11 ఏళ్లయినా ఏపీలో అంతంత మాత్రంగానే సినీ ఇండస్ట్రీ ప్రభావం ఉంటుంది. కనీసం సింగిల్ షెడ్యూల్ సినిమా కూడా ఏపీలో తీయలేని పరిస్థితి ఉండటంతో ఈ భేటీకి ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రభుత్వం ఏం చెబుతుంది, సినీ ప్రముఖులు ఏమి కోరతారనే అంశంపై ఈ సమావేశంలో చర్చలు జరుగనున్నాయి. చంద్రబాబు సూచన మేరకు సినీ ప్రముఖులకు మంత్రి కందుల దుర్గేష్ ఫోన్ చేసి ఆహ్వానం పలికారు. ఈ భేటీకి మొత్తం 35 నుంచి 40 మంది సినీ ప్రముఖులు హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ సమావేశం అనంతరం ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లతో మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేకంగా భేటీ కానున్నారు.

## అయోమయంలో వైసీపీ!

-మొదటిపేజీ తరువాయి

ఈ ఇష్యూ ఇంకా ఎటువైపు టర్న్ తీసుకుంటుందోనన్న సస్పెన్స్ అయితే కంటిన్యూ అవుతోంది. కుల వివక్షకు సంబంధించిన పదం వాడిన సజ్జలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ల కింద కేసు పెట్టారని కోరారు. ఇది ఇలా ఉంటే ఆ సీనియర్ జర్నలిస్ట్ అరెస్ట్‌పై వైసీపీ అధినేత జగన్ ట్వీట్ చేయడం కూడా చర్చనీయాంశంగా మారింది.జరుగుతోన్న..జరగబోయే నష్టాన్ని అంచనా వేయడంలో వైసీపీ థింక్ ట్యాంక్ కచ్చితంగా ఫెయిల్ అయిందనేది ఎనలిస్టుల అభిప్రాయం. మహిళలతో ముడిపడి ఉన్న ఇష్యూ..పైగా అమరావతి రాజధానిగా ఏపీ ప్రజల సెంటిమెంట్‌గా ఉంది. అలాంటి సెన్సిటివ్ అంశాన్ని హ్యాండిల్ చేయడంలో ఫ్యాన్ పార్టీ విఫలమైందన్న టాక్ వినిపిస్తోంది. లాస్ట్‌కు ఇప్పుడు ఈ ఇష్యూలో వైసీపీ నేతలెవరూ స్పందించేందుకు మీడియా ముందుకు రాలేని పరిస్థితి.మొదటినుంచి మూడు రాజధానుల వ్యవహారంతో అమరావతి రైతులు వర్సెస్ జగనన్నట్టుగా రాజధాని ప్రాంతంలో పరిస్థితులు ఉన్నాయి. గత ఎన్నికల్లో రాజధాని అంశం వైసీపీకి ఓటమికి కారణమైవాటిల్లో ప్రధానమైంది. అమరావతి రైతుల విషయంలో జగన్ సర్కార్ వ్యవహరించిన తీరు, ఏపీకి రాజధానే లేకుండా చేశారన్న విమర్శలతో..ఎన్నికల్లో ఘోర పరాజయం కావాల్సి వచ్చింది.ఆ తర్వాత కూడా రాజధానిపై వైసీపీ తన స్టాండ్‌ను మార్చుకున్నట్లు కనిపించడం లేదు. ప్రజాస్వామ్యంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం ఏదైనా మిస్టేక్స్ చేస్తే ఎలానో సరి చేసుకుంటుంటాయి. కానీ వైసీపీ మాత్రం తెగే దాక లాగుతున్నట్లు కనిపిస్తోంది. ఇక ఆ పార్టీ నేతల్లో కొందరు అయితే అమరావతి ఒక్కటే రాజధాని అని చెప్పేస్తున్నారు. ప్రజలు అంతగా తీర్పు ఇచ్చాక మళ్లీ మూడు రాజధానుల జోలికి వెళ్లబోమని కూడా అంటున్నారు.కానీ వైసీపీ అధినేత, ఆయన సన్నిహితులు మాత్రం రాజధాని మ్యాటర్‌లో తమ స్టాండ్ ఏంటో చెప్పకుండానే..అనుచిత వ్యాఖ్యలతో ఇరకాటంలో పడిపోతున్నారు. లేటెస్ట్ ఎపిసోడ్ వైసీపీకి తీవ్ర నష్టం చేసేదే. సదరు జర్నలిస్ట్ అలాంటి వ్యాఖ్యలు చేయగానే దానికి సరైన వివరణ ఇస్తే వివాదం అంతటితో ముగిసిపోయే అవకాశం ఉండేది. కానీ సమర్థించుకునే ప్రయత్నం చేస్తుండటంతో వైసీపీపై నెగెటివ్ ఇంపాక్ట్ పడుతుంది. ఇలా ఫ్యాన్ పార్టీ వ్యూహాత్మక పొరపాటు టీడీపీకి అస్త్రంగా మారుతుంది. జరుగుతున్న పరిణామాలను ఎమోషన్‌తో కాకుండా ఎనలైజ్ చేసుకుని ముందుకు వెళ్తేనే వైసీపీకి మంచిదన్న అభిప్రాయం వినిపిస్తోంది.

## అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే



**స్వర్ణసాగరం వాకాడు :**

మండల పరిధిలోని బాలిరెడ్డిపాలెం, తూపిలి పాలెం పంచాయతీలలో పలు అభివృద్ధి కార్యక్రమాలను శనివారం గూడూరు శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్ ప్రారంభించారు. వాకాడు టిడిపి నేతలు ఆయనకు ఈ సందర్భంగా ఘన స్వాగతం పలికారు. ముందుగా బాలిరెడ్డిపాలెం గ్రామంలో రూ. 10 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును స్థానిక నేత దువ్వూరు వెంకటరమణారెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం తూపిలి పాళెంలో ప్రధానమంత్రి మత్స్యకార యోజన పథకం కింద రూ. 2 కోట్ల రూపాయలతో చేపడుతున్న మల్టీపర్పస్ భవనం, సాయిల్ టెస్ట్ ల్యాబ్, సోలార్ లైట్స్, ప్లాట్ ఫామ్‌లతో పాటు మరో రూ. 66 లక్షలతో ఏర్పాటు చేయనున్న ఫిషింగ్ బోట్ రోడ్డు నిర్మాణ పనులకు అయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వానికి, ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రజలు తేడాలు గుర్తించాలన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఖాతాలో తల్లికి వందనం నిధులు రెండు వేల రూపాయలు జమ అవుతున్నాయని వైసీపీ చేస్తున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. అలాంటి అసత్య ప్రచారాలు వైసీపీకి అలవాటేనని ఆధారాలు ఉంటే నిరూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి రాజేష్, తహసీల్దారు రామయ్య, ఎంపీడీవో శ్రీనివాసులు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు దువ్వూరు మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దోసకాయల కృష్ణమూర్తి, బిజెపి నేత పాపా రెడ్డి పురుషోత్తమ రెడ్డి, సన్నారెడ్డి విజయ శేఖర్ రెడ్డి, సన్నారెడ్డి ప్రసాద్ రెడ్డి, కుంచం దయాకర్, పంట్రంగం అరుణ్ కళ్యాణ్, తూపిలి సాగునీటి సంఘం అధ్యక్షుడు తిరుమూరు శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**తిరుపతి**

చిత్తూరు నెల్లూరు అనంతపురం

విలేకరులు కావలెను

సంప్రదించండి : 9440352036

# బుచ్చిలో జిల్లా ఆటో యూనియన్ 6 వ జిల్లా మహాసభలు





## జిల్లా నేత మారు బోయిన రాజా వెల్లడి

తోటపల్లి గూడూరు స్వర్ణసాగరం జూన్ 14

బుచ్చిరెడ్డిపాలెం టౌన్ లో జూలై 1న జిల్లా ఆటో యూనియన్ మహాసభలు నిర్వహిస్తున్నట్లు నేతలు పేర్కొన్నారు. ఈ మహాసభలను జయప్రదంచేయాలని కోరుతూ టి పి గూడూరు మండలం నరకూరు సెంటర్ ఆటో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు నాశిన పరుశురామయ్య, ఆరణి గోపీల ఆధ్వర్యంలో శనివారం ఆటో కార్మికులకు కరపత్రాలు పంపిణీచేశారు ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మారుబోయిన రాజా మాట్లాడుతూ... గత 24 సంవత్సరాల నుండి ఆటో కార్మికుల సంక్షేమ మరియు అభివృద్ధి కోసం అహర్నిశలు అలుపెరగని పోరాటాలు చేసిన సంఘం నెల్లూరు జిల్లా ఆటో కార్మిక సంఘం అని ఈ కాలంలో ఆటో కార్మికులపై కేంద్ర ప్రభుత్వం ఎం వి యాక్ట్ అమెండ్మెంట్ బిల్లు తెచ్చిన తర్వాత ఆటో కార్మికులపై అధిక జరిమానాలు, ఛలానా ఫీజులు మరియు వాహనాల ఫిట్నెస్ సర్టిఫికెట్లకు సంబంధించి లేట్ పెనాల్టీలకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు నిర్వహించిన సంఘం నెల్లూరు జిల్లా ఆటో కార్మిక సంఘం మని, గత మహాసభ నుండి ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం డ్రైవర్లపై ప్రమాదాలకు సంబంధించి వారినే బాధ్యులను చేస్తూ కార్మికులను జైలు పాలు చేసే విధంగా ప్రయత్నం చేసిందని దీనికి వ్యతిరేకంగా మరియు జీవో నెంబర్ 21 ప్రకారం విపరీతమైన ఆర్థిక భారాలు మోపిందని అంతేకాకుండా ఎఫ్సీ లు, డ్రైవింగ్ లైసెన్సు సంబంధించి సెన్సార్ ట్రాకింగ్ సిస్టం తెచ్చి కార్మికులను పూర్తి ఇబ్బందులకు గురి చేసే ప్రయత్నం చేసిందని వీటన్నింటికీ కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపితే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే దానికి ముందు ఉండడం గమనార్హం అని అధికారంలోకి రాకముందు తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఆటో కార్మికులకు 15000 రూపాయలు వాహన మిత్ర అమలు చేస్తామని మొదటి సంవత్సరం అధికారం పూర్తయినా కూడా ఇంతవరకు ఆటో డ్రైవర్ కి వాహన మిత్ర అమలు చేయలేదని ఆటో కార్మికులకు వాహన మిత్ర అమలు చేయాలని అదేవిధంగా జూలై 1వ తేదీ బుచ్చిరెడ్డిపాలెం టౌన్ లో జరిగే నెల్లూరు జిల్లా ఆటో కార్మిక సంఘం 6వ జిల్లా మహాసభలో జయప్రదం చేయవలసిందిగా కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నరుకూరు సెంటర్ ఆటో యూనియన్ కమిటీ సభ్యులు వెంకట శేషయ్య ఆకుల రఘు మరియు బాషా ,శీను, బాబు,మల్లి ఎల్లి గోపి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు

# యోగా వల్ల శారీరక,మానసిక ఆరోగ్యాలకు ఎన్నో ప్రయోజనాలు





## కోట ఎం.ఈ.ఓ 2 దారా మస్తానయ్య

కోట స్వర్ణసాగరం జూన్ 14

యోగా వల్ల శారీరక మానసిక ఆరోగ్యాలకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని కోట మండల విద్యాశాఖ అధికారి దారా మస్తానయ్య పేర్కొన్నారు.యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కోట మండలం కోటలోని ఎ.వి.కే.ఆర్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఏర్పాటుచేసిన యోగా మార్క్ ట్రైన్ కార్యక్రమాన్ని కోట మండల ఎంఈఓ 2 దారా మస్తానయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దారా మస్తానయ్య, గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ యోగా,ధ్యానం వలన ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని,యోగా చేయడం వలన మెదడు పనితీరును మెరుగు పరుస్తుందని,రక్తపోటును తగ్గించి, ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుందని అన్నారు.ఇది ఒక వ్యక్తిని శారీరకంగా,మానసికంగా సానుకూలంగా ప్రభావితం చేస్తుందన్నారు.యోగ కు నిత్య జీవితంలో కొంత సమయాన్ని కేటాయించి అందరూ ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని ఆయన కోరుతూ యోగ,ధ్యానం యొక్క ప్రాముఖ్యతను వివరించారు.ఈ యోగా కార్యక్రమంలో ఎంపీటీసీ షేక్ మొబిన్ భాష,బిజెపి నాయకులు రమేష్ బాబు,వెంకటేశ్వర్లు,నికేష్, పాఠశాల పి.డి షేక్ వల్లి అహ్మద్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యుత్ శాఖ అధికారుల పని తీరుతో విసుకు చెందుతున్న కోట ప్రజలు

### వేలపాలా లేని కరెంట్ కోతలతో ఇబ్బందులలో కోట ప్రజలు

### రోజుకు పదుల సంఖ్యలలో కరెంట్ కోతలు

### అధికారులు,నాయకులు కరెంట్ కోత్తలపై స్పందించండి కోట ప్రజలు



కోట స్వర్ణసాగరం జూన్ 14

కోట మండలం కోట పట్టణ పరిధిలో విద్యుత్ శాఖ అధికారులు రోజుకు వదులు సంఖ్యలో వేలపాల లేకుండా కరెంటు కోతలు విధించడంతో తాము విసుగు చెందుతున్నామని కోట ప్రజలు వాపోతున్నారు.రాత్రి పగలు తేడా లేకుండా గంటకోసారి,కరెంటు తీసి వేస్తున్నదంతో కోట గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో అనేకసార్లు కరెంటు నిలిపి వేస్తున్నారని,సెల్ ఫోన్ల ద్వారా విద్యుత్ అధికారులను కరెంటు తీసి వేయడానికి గల కారణాలను అడగగా ప్రతిరోజు ప్రతి గంట ఎక్కడో చోట విద్యుత్ మరమ్మత్తులకు గురి అవుతుందని చెప్పున్నారు అని కోట స్థానికులు తెలిపారు.చివరికి విద్యుత్తును రొయ్యల గుంటలకు, ప్రైవేటు సంస్థలకు అమ్మి వేస్తున్నారేమోనని అనుమానాలు కూడా ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. సంబంధిత అధికారులు,కోట పట్టణ నాయకులు విద్యుత్ కోతలపై స్పందించి విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని కోట గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# ఉచితవైద్య శిబిరం ను సద్వినియోగపరుచుకోండి

## సర్పంచ్ మోహనప్రియ

స్వర్ణ సాగరం ఏర్పేడు:-



తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం యం డి పుత్తూరు గ్రామంలో సర్పంచ్ మోహనప్రియ ఆధ్వర్యంలో నారాయణాద్రి హెూస్పిటల్స్ వారి సౌజన్యంతో 15/06/2025 ఆదివారం ఉదయం 10 గంటలకు ఉచితవైద్య శిబిరం నిర్వహించబడును. ఈ వైద్య శిబిరం నందు బిపి షుగర్ ఈసిజి తదితర అన్ని రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించి తగిన మందులు ఉచితంగా ఇవ్వబడును. కావున ఈ సదావకాశాన్ని చుట్టుపక్కల గ్రామ ప్రజలు సద్వినియోగ పరుచుకోగలరు.

# నైపుణ్యాలతో జీవితం నిర్మించుకుందాం






స్వర్ణ సాగరం ఏర్పేడు:-

పనిలో నాణ్యత కోసం ప్రతి ఒక్కరూ పంచసూత్రాలను పాటించాలని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ఎన్.బి. సుధాకర్ రెడ్డి సూచించారు. ఏర్పేడు సమీపంలోని ఎస్.ఓ.ఎస్ బాలల గ్రామంలో విద్యార్థులకు నిర్వహించిన నైపుణ్య శిక్షణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.

జ్ఞానం, వికాసం, సామర్థ్యం, చురుకుదనం, నైపుణ్యం ఉన్నప్పుడే వ్యక్తి వృత్తిలో రాణిస్తాడని అన్నారు. బాల్యం నుంచే ఈ విలువైన లక్షణాలను అభివృద్ధి చేసుకోవాలని, చదువు మరియు మార్కులకు పరిమితం కాకుండా జీవితానికి అవసరమైన వివిధ కౌశలాలను అలవర్చుకోవాలని విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు.శారీరక దృఢత్వం, చురుకుదనం, సామాజిక స్పృహ, సాధారణ జ్ఞానం అలవర్చుకోవడం ద్వారా సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. అలాగే, జీవన నైపుణ్యాల్లో భాగంగా స్వీయ అవగాహన, సమయ పాలన, భావ వ్యక్తీకరణ, క్రమశిక్షణ వంటివి వ్యక్తిగత ప్రగతికి పునాదులుగా నిలుస్తాయని పేర్కొన్నారు.సరైన నిర్ణయాలు తీసుకోవడం, సమస్యల పరిష్కారానికి సరైన దారితెరవడం, లక్ష్యాలు నిర్దేశించుకోవడం, ఒత్తిళ్లను సమర్థంగా ఎదుర్కొనడం వంటి నైపుణ్యాలు అనివార్యమని అన్నారు.విలువలతో కూడిన జీవన విధానం మానసిక ఆనందాన్ని కలిగించడమే కాకుండా సమాజంలో వ్యక్తిగత విలువను పెంచుతుందని వ్యాఖ్యానించారు.ఈ కార్యక్రమానికి ఎస్.ఓ.ఎస్ కుటుంబ బలోపేత కార్యక్రమం లొకేషన్ ఇన్చార్జ్ వి. సత్యనారాయణ అధ్యక్షత వహించారు. బాలల హక్కులపై అవగాహన కల్పించారు. సహెూద్యోగులు మునిరత్నం మరియు వెంకటరమణ చురుకుగా పాల్గొని తమ సహకారం అందించారు.

# ముత్తుకూరులో బాల సంస్కార కేంద్రం



ముత్తుకూరు స్వర్ణ సాగరం జూన్ 14

స్థానికగ్రామములో ని గొల్లవీధి గిరిజన సంఘం లో సింహపురి వైద్య సేవా సమితి సహకారముతో జయభారత్ హాస్పిటల్ ఆధ్వర్యములో గిరిజన బాలబాలికలకు బాలసంస్కార కేంద్రం సాయం బడి ఏర్పాటు చేశారు . ఈ కేంద్రం ద్వారా గిరిజన బాలబాలికలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని కేంద్ర బాధ్యులు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ముత్తుకూరు మండల పర్యవేక్షక్ పవన్ కుమార్ గిరిజన నేత పొట్లూరి శ్రీనివాస్ లు ఉన్నారు

# "ప్రపంచ ఆర్ధిక స్ధాయికి ఎదిగిన భారత్ "




## యోగాంధ్ర కార్యక్రమంలో సన్నపురెడ్డి

బుచ్చిరెడ్డిపాలెం స్వర్ణ సాగరం జూన్ 14

ప్రపంచ దేశాలను అధిగమిస్తూ భారతదేశము నాలుగో స్ధానంలో ఆర్థిక స్థాయికి ఎదిగినట్లు నెల్లూరు ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక శ్రీ గోపాలకృష్ణయ్య పాఠశాలలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పాఠశాల గత 35 సంవత్సరాలుగా విద్యార్థులను క్రమశిక్షణ బాటలో నడుపుతూ దేశభక్తి ఇనుమడింప

జే సే క్రమంలో చక్కటి విద్యను అందించడం ప్రశంసనీయమన్నారు కార్యక్రమానికి ముందుగా విద్యార్థుల చేత యోగాసనాలను ప్రదర్శించారు. ఈ ఆసనాలలో ప్రధానంగా తడాసన్ , అర్థ కటి చక్రాసన్, పద్మా సన్ ఇతర ఆసనాలు విద్యార్థులను ఆకర్షించాయి. ఈ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన 15 మంది విద్యార్థులకు ఉత్తమ విద్యార్థి పురస్కారాలు రూ 30000 విలువైన వస్తువులను అందించారు ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నేత దొడ్ల కోదండరామిరెడ్డి ఉత్తమ ఉపాధ్యాయ రాష్ట్రపతి అవార్డు గ్రహీత గుండ్రా శ్రీనివాసులు రెడ్డి పాఠశాల కరస్పాండెంట్ నేలనూతల శ్రీధర్ ప్రిన్సిపాల్ సురేఖ విద్యార్థులు ఉపాధ్యాయులు గ్రామస్తులు పాల్గొన్నారు

# ఏర్పేడు పశు వైద్యాధికారిణిగా డాక్టర్ జి మోహన కుమారి

స్వర్ణసాగరం ఏర్పేడు,జూన్14



పశువైద్యాధికారిణిగా డాక్టర్ జి మోహన కుమారి పదవి బాధ్యతలు స్వీకరించారు. ఏర్పేడులో పశు వైద్యాధికారినిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ శిల్పారెడ్డి స్థానంలో జి మోహన కుమారి బాధ్యతలు స్వీకరించారు. పాకాల మండలం కే వడ్డేపల్లి నుంచి ఆమె ఏర్పేడుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మోహన కుమారి మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం అందిస్తున్న పథకాలను రైతులకు సక్రమంగా అందే విధంగా కృషి చేస్తానని ఆమె తెలిపారు. ఏర్పేడు మండలంలో పశు శాఖ సేవలు రైతులకు సక్రమంగా అందేవిధంగా కృషి చేస్తానని మోహనకుమారి పేర్కొన్నారు.

# సీతారాముల కళ్యాణ మహెూత్సవంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

కనిగిరి స్వర్ణ సాగరం జూన్ 14



పామూరు మండలం నర్ర మారెళ్ళలో శనివారం కోదండ రామస్వామి కళ్యాణం వైభవంగా నిర్వహించారు.ఈ సీతారాముల కళ్యాణం మహెూత్సవంలో కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి హాజరై స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వాహకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## స్వామివారికి వెండి ఆభరణాలు విరాళం



### విరాళం దాత తిరుపతి వాస్తవ్యులు చంద్రశేఖర్

కాణిపాకం ,జూన్ 14 స్వర్ణ సాగరం

స్వామివారికి వెండి ఆభరణాలు విరాళం. కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి ఆలయమునకు వెండి దీపం , నైవేద్యం పాత్రలు విరాళం, సుమారు వాటి బరువు 3. కిలో 500 గ్రాములు, వాటి విలువ సుమారు 3,80,000 రూపాయలు, దాత చంద్రశేఖర్ , వారి కుటుంబ సభ్యులు తిరుపతి వాస్తవ్యులు, వీరు దేవస్థానం కార్యనిర్వహణధికారి కార్యాలయం నందు ఈ.వో పెంచల కిషోర్ కి అందజేశారు, ఆలయ అధికారులు వీరికి దర్శనం ఏర్పాట్లు చేసి అనంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులచే ఆశీర్వాదం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపర్డెంట్ కోదండపాణి, సి ఎఫ్ ఓ నాగేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

## రేణిగుంట విమానాశ్రయంలో మంత్రి అచ్చెంనాయుడు కి ఘన స్వాగతం పలికిన పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్



పూతలపట్టు, జూన్ 14 స్వర్ణ సాగరం

పూతలపట్టు,చిత్తూరు జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెం నాయుడు కి రేణిగుంట విమానాశ్రయం వద్ద ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ ,చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని అచ్చెం నాయుడు కి పుష్పగుచ్ఛం అందజేస్తూ సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం మంత్రి తో పాటుగా రోడ్డు మార్గం ద్వారా చిత్తూరుకు బయలుదేరారు.

## ఇంటర్నేషనల్ యోగ డే కి సన్నద్ధం ఎంపీడీవో ధనలక్ష్మి



కాణిపాకం ,జూన్ 14 స్వర్ణ సాగరం

ఇంటర్నేషనల్ యోగ డే కి సన్నద్ధం ఎంపిడిఓ ధనలక్ష్మి. శనివారం కాణిపాకం, ఎంపీడీవో ధనలక్ష్మి మాట్లాడుతూ జూన్ 21 వ తేదీన జరగనున్న యోగాంధ్ర కార్యక్రమములో భాగంగా ఐరాల మండలం లోని అన్ని సచివాలయాల వేదికల లో యోగ డే విజయవంతం గా నిర్వహించేందుకు గాను శనివారం ఉదయం డెమో యోగా నిర్వహించారని ఎంపిడిఓ ధనలక్ష్మి తెలిపారు. ఇందులో భాగంగా ఆమె కాణిపాకం ఉన్నత పాఠశాల ఆవరణంలో జరిగిన యోగ ప్రాక్టీస్ లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శాంతి సాగర్ రెడ్డి, పి.డి నాగరాజ, పంచాయతీ కార్యదర్శి ప్రమీల, సచివాలయం సిబ్బంది, వార్డు సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు ,విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్య భద్రతకు కూటమిపాలనలో శ్రీరామరక్ష





### సూళ్లూరుపేట శాసన సభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ

పెళ్లకూరు స్వర్ణసాగరం జూన్14.

రాష్ట్ర ప్రజల ఆరోగ్య భద్రత కోసం ఒక్కొక్కరికి 25 లక్షల రూపాయలు ఉచితంగా వ్యయం చేసేలా కూటమి ప్రభుత్వం శ్రీరామరక్ష లాగా నిలిచిందని సూళ్లూరుపేట శాసన సభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ వెల్లడించారు. శనివారం మండల కేంద్రమైన పెళ్ళకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో 50లక్షల రూపాయలు 15వ ఆర్థిక ప్రణాళిక సంఘం నిధులతో నిర్మించిన నూతన అదనపు భవనాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 25 లక్షలు చొప్పున, కేంద్ర సర్కారు ఐదు లక్షలు చొప్పున ప్రతి ఒక్కరి ఆరోగ్యానికి భరోసా కల్పించేలా ఉచిత వైద్య సేవలు అందించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి పేదవాడికి అండగా నిలవడం సంతోషమన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులను అధిగమిస్తూ... ఇచ్చిన సూపర్ సెక్స్ హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేస్తున్న సుపరి పాలనకు అందరూ అండగా నిలవాలని కోరారు. రాష్ట్ర రాజధాని నిర్మాణం అమరావతిగా, పోలవరం డ్యాం లక్ష్యంగా పేద ప్రజల అభివృద్ధి ధ్యేయంగా సుపరిపాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వానికి అన్ని వర్గాల ప్రజలు మద్దతుగా నిలవాలన్నారు.

### ప్రజా శ్రేయస్సే లక్ష్యం: మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం.....

రాష్ట్ర ప్రజల శ్రేయసే ముఖ్య లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందిస్తున్న సంక్షేమ పథకాలు నిదర్శనమని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మండలంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టి ఎమ్మెల్యే విజయ్ శ్రీ చేతుల మీదుగా ప్రారంభించడం శుభప్రదం అన్నారు. స్థానిక నాయకుల కోరిక మేరకు శిథిలావస్థలో ఉన్న మండల ప్రభుత్వ కార్యాలయాలు, పి.హెచ్.సి ప్రహరీ గోడ నిర్మాణం నిర్మించేలా కృషి చేస్తామన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య ఆధ్వర్యంలో పార్టీని బలోపేతం చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్నింటా విజయం సాధించేందుకు ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్ ఓ బాలకృష్ణ నాయక్, స్థానిక వైద్యాధికారి డాక్టర్ సుజాత, తహసిల్దార్ ద్వారకానాథ్ రెడ్డి, ఎంపీడీవో ప్రమీల రాణి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీ కృష్ణారెడ్డి, సర్పంచులు కందమూడి శివకుమార్, దేవా రెడ్డి నాగేంద్ర రెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు యాగాని బెన్నీ, పోలయ్య, స్వర్ణముఖి సిస్టం ఆయకట్టు చైర్మన్ దామెర ప్రసాద్ నాయుడు, దువ్వూరు రాకేష్ రెడ్డి, లోకేష్ నాయుడు, శేఖర్ నాయుడు, సత్యం రాజు, పాపాడి రాజారెడ్డి, వేణు రెడ్డి, మురళి నాయుడు, మాధవరెడ్డి, హరి నాయుడు, యుగంధర్, మల్లికార్జున్ రెడ్డి, రామకృష్ణ, రమణయ్య, పరుశురాం, మళ్లీ రెడ్డి, వివిధ గ్రామాల ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.





# రక్త దాతలకు సన్మానం



కనిగిరి స్వర్ణ సాగరం జూన్ 14

రక్తదానం మానవత్వానికి ప్రతీక అని రక్తదానం చేస్తే మరోకరి ప్రాణం కాపాడిన వారవుతారని కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్, న్యాయవాది షేక్ అబ్దుల్ గఫార్ అన్నారు.

ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకుని శనివారం కనిగిరి మున్సిపాలిటీ కార్యాలయం చైర్మన్ ఛాంబర్ నందు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ,గుడ్ హెల్ప్ ఫౌండేషన్,కె ఎస్ ఎం ఎడ్యుకేషనల్ సోసైటీ ఆధ్వర్యంలో రక్త దాతల అభినందన సత్కార, సన్మానం కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఇప్పటివరకు 54 సార్లు రక్త దానం చేసిన ముత్యాల శ్రీనివాస రెడ్డి, 40 సార్లు రక్త దానం చేసిన వర్రా చిన్న సింగా రెడ్డి,18 సార్లు రక్త దానం చేసిన మారెళ్ల వెంకట కృష్ణ రెడ్డి కి పూల మాల, శాలువాతో సత్కారం చేసి ఘనంగా సన్మానం చేసి వారిని అభినందించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని సూచించారు. అన్ని దానాల కన్నా రక్త దానం గొప్పదని చెప్పారు.రక్తదానం చేసినవారికి సన్మానం చేయడం ద్వారా,వారి త్యాగాన్ని గుర్తించి, వారిని గౌరవించినట్లు అవుతుందని అన్నారు.రక్తదానం చేసేవారికి సన్మానం చేయడం ద్వారా మరిన్ని రక్త దానాలు చేయడానికి ఇతరులను ప్రోత్సహించవచ్చునని రక్తదానం గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి ఇది ఒక మంచి మార్గం అని కార్యనిర్వాహకులను అభినందించారు.కార్యక్రమంలో రెడ్ క్రాస్ వాలంటీర్, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ మంద్రు రమేష్ బాబు,జి ఎస్ అండ్ జి డి కె ఫౌండేషన్ కోఆర్డినేటర్ నవ కుమార్, మదర్ సేవా సమితి అధ్యక్షులు నాయబ్ రసూల్,మాజీ ఎ ఎం సి డైరెక్టర్ బొట్టు శ్రీను,షేక్ నాగుర్ బి,మద్దిశెట్టి భారతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు రుచికరమైన నాణ్యమైన ఆహారాన్ని అందించాలి.





### మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి స్వర్ణ సాగర్ జూన్ 14

అన్నా క్యాంటీన్లలో ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ తెలిపారు.అన్న క్యాంటీన్ సిబ్బంది వ్యవహార శైలి బాగోలేదని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ దృష్టికి ప్రజలు తీసుకొనిరాగా వెంటనే ఆయన అన్నా క్యాంటిన్ ను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.అనంతరం అన్న క్యాంటిన్ లో పనిచేసే సిబ్బంది క్యాంటిన్ కు వచ్చే ప్రజలు పట్ల ప్రేమానురాగలు కలిసి నాణ్యమైన ఆహారం అందించాలని ఆయన హెచ్చరించారు.ఆహార పదార్థాల రుచి,నాణ్యతలను ప్రజలను అడిగి తెలుసుకోగా బాగానే ఉందని సాంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ పేదల ఆకలిని తీర్చేందుకు తక్కువ ధరకే నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు ప్రభుత్వం అన్నా క్యాంటిన్లను ఏర్పాటుచేసిందని, ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అన్నా క్యాంటీన్ల ద్వారా రుచికరమైన, నాణ్యమైన ఆహారాన్ని ప్రజలకు అందించాల్సిన బాధ్యత అన్నా క్యాంటీన్ నిర్వాహకులపై ఉందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన 5 రూపాయల ధరకన్నా ఎక్కువ వసూలు చేయవద్దని, ఉదయం మిగిలిన ఆహార పదార్థాలను సాయంత్రం సమయంలో ఎట్టిపరిస్థితులలోనూ ప్రజలకు అందించరాదన్నారు.అన్నా క్యాంటీన్ పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు.ప్రజలు ఆహరం తిన్నతరవాత ప్లేట్ లను విమర్శలకు తావులేకుండా పూర్తిగా శుభ్రంచేయాలని ఆయన తెలిపారు.

## డిప్యూటీ స్పీకర్ కు శుభాకాంక్షలు తెలిపిన డాక్టర్ బత్తుల శ్రీనివాస్

స్వర్ణ సాగరం డోర్నకల్ జూన్ 14



తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ స్పీకర్గా నియమించబడిన డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటో రామచంద్రనాయక్ ను కాంగ్రెస్ మహబూబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ బత్తుల శ్రీనివాస్ యాదవ్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ జాటోతు రామచంద్రనాయక్ నాయక్ కు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.

# కక్ష్య రాజకీయాలకు దూరంగా మెలగండి





### మాజీమంత్రి పెద్దిరెడ్డి

పెళ్లకూరు స్వర్ణసాగరం జూన్ 14.

కూటమి ప్రభుత్వంలో కొనసాగుతున్న కక్ష రాజకీయాలకు వైయస్సార్ సిపి శ్రేణులు దూరంగా మెలగాలని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారు. శనివారం తిరుపతి నుండి నెల్లూరుకు వెళుతున్న ఆయన మార్గం మధ్యలో చిల్లకూరు గ్రామం వద్ద వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, డిసిసిబి మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు కలిసి ఆయనకు స్వాగతం పలికారు. సత్యనారాయణ రెడ్డి కి, ఎంపీపీ శేఖర్ రెడ్డికి, జడ్పిటిసి సభ్యురాలు ప్రిస్కిల్లాకు, స్థానిక సర్పంచ్ హరిబాబు రెడ్డికి, పలువురు నాయకులకు పెద్దిరెడ్డి శాలువాలు కప్పి సత్కరించారు. కూటమి ప్రభుత్వంలో కక్ష రాజకీయాలకు తెర లేపి తప్పుడు కేసులు పెట్టి వైసీపీ శ్రేణులను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఏది ఏమైనాప్పటికీ పార్టీ నాయకులు కార్యకర్తలు సమనయనం పాటించి ఐక్యతగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోహన్ రెడ్డి, ఎల్లు మోహన్, సాగి జితేంద్ర, ఓడూరు వినోద్ రెడ్డి, బాలు, మురళి, శ్రీనివాసులు, పాండురంగయ్య, వెంకటేశ్వర్లు, రవి తదితరులు పాల్గొన్నారు.

# మామిడి రైతులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుంది

**:వ్యవసాయశాఖ మంత్రి :కే అచ్చం నాయుడు**

**రాష్ట్ర ప్రభుత్వం మామిడి రైతులకు 168 కోట్ల రూపాయలు సబ్సిడీ రూపంలో అందజేస్తుంది**

చిత్తూరు, స్వర్ణ సాగరం, జూన్ 14

రాష్ట్ర ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవడానికి సబ్సిడీ రూపంలో 168 కోట్ల రూపాయలు చెల్లిస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ అనుబంధ రంగాల శాఖ మంత్రివర్యులు అచ్చం నాయుడు తెలిపారు. జిల్లాలో ఒక్కరోజు అనగా శనివారం పర్యటనలో భాగంగా చిత్తూరు నియోజకవర్గ పరిధిలోని గుడిపాల మండలంలో గొల్లమడుగు నందు మామిడికాయల నిల్వ ఉంచిన పండ్ల యూనిట్ను పరిశీలించుచున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, ఎంపీ దగ్గుమల్ల ప్రసాద్ రావు, హార్టీకల్చర్ సెక్రెటరీ రాజశేఖర్ బాబు, ఆర్టికల్చర్ కమిషనర్ శ్రీనివాసులు రెడ్డి, జాయింట్ కలెక్టర్ జి విద్యాధరి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. కంపెనీ నందు మామిడికాయ ప్రాసెస్ యూనిట్లను పరిశీలించారు. మామిడికాయ జ్యూస్ ఎలా తయారవుతాదో పరిశీలించారు అనంతరం పల్లూరు నందు మామిడి రైతులతో ముచ్చటించారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రివర్యులు మాట్లాడుతూ రైతులను అన్ని విధాల ఆదుకోవడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక ఆలోచనతో మామిడి రైతులను ఆదుకోవడానికి ఈరోజు కంపెనీలతో చర్చించి ఒక ధర నిర్ణయించడం జరిగిందని తెలిపారు.



వివిధ కంపెనీలు 8 రూపాయలకే కేజీ మామిడి పండ్లు ధర నిర్ణయించడం జరిగిందని.. 4 రూపాయలు ప్రభుత్వం సబ్సిడీ రూపంలో రైతులకు వారి వ్యక్తిగత బ్యాంక్ ఖాతాలకు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతుల స్వేచ్ఛగా వారు పండించిన మామిడి పంటను, మండిళ్లలో గాని, మార్కెట్లో గాని అమ్ముకోవచ్చునని తెలిపారు, సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు చివరి కాయ వరకు విక్రయించుకోవచ్చునని.2019వ సంవత్సరంలో జిల్లాలో మామిడి ధర తెలుగుదేశం ప్రభుత్వమే 7.50 పైసలకు ధర నిర్ణయించడం జరిగిందని తెలిపారు. రైతులు నాణ్యమైన మామిడికాయలను కంపెనీలకు సరఫరా చేయాలని ఆదేశించారు. మామిడి రైతులకు 168 కోట్ల రూపాయల సబ్సిడీ రూపంలో అందజేస్తున్నామని మంత్రివర్యులు తెలిపారు.రైతుల సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేయుచున్నాడని తెలిపారు. రైతులు మార్కెట్ రిజిస్ట్రేషన్ కౌంటర్ల వద్ద మామిడికాయలను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. ప్రస్తుతం 22 మెట్రిక్ టన్నులు మామిడికాయలను కొనడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గణనాధుని సేవలో ప్రముఖులు







కాణిపాకం, జూన్ 14 స్వర్ణ సాగరం

గణనాధుని సేవలో ప్రముఖులు. కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ (ఏ పి. ఈ. డ.బ్ల్యూ. ఐ .డి సి) రాజశేఖర్ ,తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్ . మధుసూదన్ రావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సి.బి.ఐ డిఐజి మురళి రంభ .వీరు కుటుంబ సమేతంగా స్వామివారిని వేరు వేరుగా దర్శించుకున్నారు, ఆలయ అధికారులు వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి అనంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులచే ఆశీర్వాదం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేసిన దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్ , ఏ ఈ ఓ రవీంద్రబాబు,ఈ కార్యక్రమంలో ఆలయ సూపర్డెంట్ కోదండపాణి, వాసు, టెంపుల్ బాలాజీ నాయుడు, ఇన్స్పెక్టర్ రవి, దేవస్థానం మాజీ చైర్మన్ మణి నాయుడు, చిత్తూరు కోర్టు సిబ్బంది తదితరులు ఉన్నారు.

# శ్రీసిటీని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్ అధికారులు










**- పారిశ్రామికవాడ ప్రణాళిక, అమలు పట్ల ప్రశంస**

శ్రీసిటీ,స్వర్ణ సాగరం జూన్ 14, 2025:

ఏపీ దర్శన్ స్టడీ టూర్లో భాగంగా 2024 బ్యాచ్ కు చెందిన ఏడుగురు ట్రైనీ ఐఏఎస్ అధికారులు శనివారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) ఆర్.శివశంకర్ వీరికి సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ ప్రణాళిక, అత్యాధునిక మౌళిక సదుపాయాలు, సుస్థిర వృద్ధి నమూనాపై వారికి ప్రదర్శన ఇచ్చారు. మేక్-ఇన్-ఇండియా మిషన్లో శ్రీసిటీ పాత్ర, భారీ ఉపాధి కల్పన, ఈ ప్రాంత ఆర్థిక వ్యవస్థకు ఎలా ఊతమిచ్చారన్న అంశాలను వారికి వివరించారు.పర్యటనలో భాగంగా ట్రైనీ ఐఏఎస్ లు శ్రీసిటీ పరిసరాలు సందర్శించారు. శ్రీసిటీ అధికారులతో చర్చల సందర్భంగా పారిశ్రామికవాడకు సంబంధించిన వివిధ అంశాలపై ఆరా తీశారు. మోండెలెజ్ (క్యాడ్బరీస్), డైకింగ్ ఎయిర్ కండిషనింగ్ పరిశ్రమలను సందర్శించి, అక్కడ ఉత్పత్తులు, పనితీరును పరిశీలించారు. శ్రీసిటీ ప్రణాళిక, అమలు, వ్యాపార అనుకూల వాతావరణాన్ని ప్రశంసించిన ట్రైనీ ఐఏఎస్ లు, ఇతరులు అనుసరించాల్సిన అద్భుత మోడల్ గా దీనిని అభివర్ణించారు. శ్రీసిటీ వాతావరణం, పారిశ్రామిక మౌళిక సదుపాయాలు ఇక్కడ 'సులభతర వ్యాపారం', 'సులభతర జీవన సౌలభ్యాన్ని' నిర్ధారిస్తున్నాయన్నారు. ట్రైనీ ఐఏఎస్ అధికారుల పర్యటన పట్ల తన సందేశంలో సంతోషం వ్యక్తం చేసిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ట్రైనీ ఐఏఎస్ లే కాకుండా దేశ విదేశాలకు చెందిన అధికారులు, వ్యూహకర్తలు, నిర్వాహకులు, సాంకేతిక నిపుణులు తమ అధ్యయనానికి శ్రీసిటీని ఎంచుకోవడం తమకు గర్వకారణమన్నారు. ప్రణాళికాబద్ధ కార్యాచరణ ద్వారా సుస్థిర ప్రగతి సాధ్యం అనడానికి శ్రీసిటీ పయనం సాక్ష్యంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# డిప్యూటీ స్పీకర్ కు శుభాకాంక్షలు తెలిపిన డోర్నకల్ నాయకులు



స్వర్ణ సాగరం,డోర్నకల్ జూన్ 14

తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ గా డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రనాయక్,బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కాలా సుమేర్ జైన్,పట్టణ మైనార్టీ అధ్యక్షుడు ఖాదర్ బాబా, నాయకులు తారాచంద్, నాని యాదవ్, శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ జాటోతు రామచంద్రనాయక్ నాయక్ కు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.

# విడవలూరు లో నేత్రదానం.



విడవలూరు,జూన్ 14 స్వర్ణ సాగరం :

మండల కేంద్రంలోని కామాక్షి నగర్ కాలనీలో కూలీ పనులు చేసుకుంటున్నపోట్లపూడి సుబ్బరామయ్య(67) శనివారం ఉదయం అనారోగ్యంతో మృతిచెందగా విడవలూరు మనసేవా సంస్థ వ్యవస్థాపకులు దేవళ్ళ శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో కుటుంబ సభ్యుల సహకారంతో మృతుడు నేత్రాలను నెల్లూరు మోడరన్ ఐ హాస్పిటల్ కి దానం చేశారు.నేత్రాలను ఐ టెక్నీషియన్ నాగేశ్వరరావు సేకరించినారు.

# వైభవంగా సంకటహర చతుర్థి



**స్వామి వారి దర్శనముకు పోటెత్తిన భక్తులు**

కాణిపాకం జూన్ 14 స్వర్ణ సాగరం

వైభవంగా సంకటహర చతుర్థి. కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం స్వామివారి దర్శనార్థమై విచ్చేసిన భక్తులతో పోటెత్తిన కాణిపాకం, శనివారం సంకటహర చతుర్థి సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు కార్యక్రమంలో పాల్గొని వారి మొక్కలను తీర్చుకున్నారు, రెండవ శనివారం కావడంతో మాడా విధులలో కిక్కరించిన భక్తులు రద్దీ, భక్తులకు తగిన సౌకర్యాలను పర్యవేక్షించి, క్యూలైన్లు భక్తుల వద్ద దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్ , ఆలయ అధికారులు, దగ్గరుండి భక్తులకు దర్శనం ఎటువంటి ఇబ్బంది లేకుండా స్వామి వారి దర్శనం భాగ్యం కల్పించారు, చంటి బిడ్డ తల్లిదండ్రులకు వృద్ధులకు ప్రత్యేక దర్శనం కల్పించిన ఆలయ అధికారులు.

# ఘనంగా జన్మదిన వేడుకలు



కనిగిరి స్వర్ణ సాగరం జూన్ 14

కనిగిరి మున్సిపల్ కార్యాలయంలోని మున్సిపల్ చైర్మన్ ఛాంబర్ నందు శనివారం కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫూర్ తన సిబ్బంది అయిన హరిబాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాజీ ఏ ఎం సీ డైరెక్టర్ బొట్టు శ్రీనివాసులు మదర్ సేవ సమితి అధ్యక్షులు నాయబ్ రసూల్

గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ బాబు,నవ కుమార్. భారతి.నాగూర్ బీ తదితరులు పాల్గొన్నారు.

# చెరుకూరి వారి ఓణీలా ఫంక్షన్ లో పాల్గొన్న కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్




కనిగిరి స్వర్ణ సాగరం జూన్ 14

చెరుకూరి నరసింహారావు (బుజ్జి )కుమార్తె ఓణీలా ఫంక్షన్ లో కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ పాల్గొని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసి డైరెక్టర్ బొట్టు శ్రీనివాసులు మదర్ సేవాసమితి అధ్యక్షులు నాయబ్ రసూల్ గుడ్ హెల్ప్ డైరెక్టర్ రమేష్ బాబు,నవ కుమార్,భారతి,నాగూర్ భీ, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసిటీకి రెడ్ క్రాస్ పురస్కారం









శ్రీసిటీ,స్వర్ణ సాగరం జూన్ 14, 2025:

శ్రీసిటీ నిర్వహించిన రక్తదాన శిబిరం రాష్ట్రంలో అత్యుత్తమ రక్తదాన శిబిరాలలో ఒకటిగా గుర్తింపు పొందింది. ఈ మేరకు 2025 ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖచే ఉత్తమ పురస్కారం అందుకుంది. గుంటూరులోని భారతీయ విద్యా భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఈ అవార్డును ప్రదానం చేశారు. శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్ర కుమార్, ఇసుజు మోటార్స్ ఇండియా, యాక్సెలెంట్ ఫార్మా సైన్స్ ప్రతినిధులు అవార్డును స్వీకరించారు. పై కార్యక్రమంలో పలువురికి పురస్కారాలు పంపిణీ చేయగా, 2023%–%24 సంవత్సరానికి 'ఒకే శిబిరంలో సేకరించిన అత్యధిక రక్త యూనిట్లు' విభాగంలో శ్రీసిటీ ద్వితీయ స్థానంలో నిలిచింది. ఇది సామాజిక బాధ్యత మరియు ప్రజారోగ్యం పట్ల శ్రీసిటీ నిరంతర నిబద్ధతను ప్రతిబింబిస్తుంది.రెడ్ క్రాస్ అవార్డు పట్ల సంతోషం వ్యక్తం చేసిన శ్రీసిటీ డైరెక్టర్ (CSR) నిరీషా సన్నారెడ్డి, ఈ గుర్తింపు పారిశ్రామిక అభివృద్ధి సామాజిక నిబద్ధతతో కలిసి నడవాలనే తమ నమ్మకాన్ని పునరుద్ఘాటిస్తుందన్నారు. ప్రాణాలను కాపాడే లక్ష్యంతో చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమంలో చేతులు కలిపిన తమ ఉద్యోగులు, పరిశ్రమల కార్మికులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీ వెంకటేశ్వర ఫార్మసీ కళాశాలలో పట్టభద్రులు వేడుక






పూతలపట్టు స్వర్ణ సాగరం జూన్ 14

పూతలపట్టు మండల సమీపానగల శనివారం శ్రీ వెంకటేశ్వర ఫార్మసీ కళాశాల అటానమస్ ఆర్ వి ఎస్ నగర్ ఆధ్వర్యంలో బీఫార్మసీ విద్యార్థుల పట్టబద్రులు వేడుక గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అపోలో మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ సత్యనారాయణ గారు జె ఎన్ టి యు తరఫున డాక్టర్ దేవన్న కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్ గారు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతిశ్వరి మరియు అధ్యాపకులు బృందం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## పూతలపట్టు పశువైద్యాధికారిగా డాక్టర్ విజయకుమార్



పూతలపట్టు స్వర్ణ సాగరం జూన్ 14

స్థానిక పూతలపట్టు పశువైద్యాధికారిగా శనివారం బాధ్యతలు చేపట్టిన డాక్టర్ విజయ్ కుమార్ అనంతరం ఈ సందర్భంగా డాక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ పూతలపట్టు హెడ్ క్వార్టర్ నందు అందుబాటులో ఉండి ప్రజలకు సేవ చేస్తూ అనారోగ్యంగా ఉన్న మూగజీవులను ఎప్పటికప్పుడు వైద్యం అందించి వాటికి చేస్తూ వాటిని కాపాడుతా అన్నారు డాక్టర్ విజయ్ కుమార్ గారికి మండల రైతులు దృశ్యాలతో ఘనంగా సత్కరించారు

## గోమాతకు వేడుకగా అంత్యక్రియలు

స్వర్ణ సాగరం ఏర్పేడు,జూన్ 14



పవిత్రంగా ఆవును గోమాతగా పిలుచుకునే సాంప్రదాయం హిందువులది . మండలంలోని వికృత మాల గ్రామంలో గోమాతకు శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహిం చారు. 20 సంవత్సరాల వయస్సు కలిగిన గోమాత 18 ఈతలు ఈనడం ద్వారా 9 పెయ్యి,9 కోడె దూడలకు జన్మనిచ్చి పాలు ఇవ్వడం ద్వారా పాలు డిపో శేఖర్ యాదవ్ కు ఆర్థికంగా ప్రయోజనం చేకూర్చింది. శనివారం నాడు గోవు మృతి చెందడంతో శేఖర్ యాదవ్ కుటుంబ సభ్యులతో పాటు చుట్టుపక్కల మహిళలు గోమాతకు పూజలు నిర్వహించి దహన సంస్కరాలు నిర్వహించారు. మైల తీరేందుకు పాలు కూడా పోశారు ఇన్నేళ్లు తమకు ఎంతో సాయంగా ఉన్న గోమాత మృతితో ఆ కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది.

## కస్మూర్ మస్తాన్ బాబా గంధోత్సవాణ్ణి నిర్వహించిన మహబూబ్ బాషా

### ఫాతెహా నిర్వహించిన మిరియాల బాబా గౌసియా ఆశ్రమం పీఠాధిపతి ఖ్వాజా జుబేర్ హయాత్ ఖాదరీ

రేణిగుంట స్వర్ణ సాగరం జూన్ 14



పట్టణ సంత సమీపాన ఉన్న రైల్వే గేటు దగ్గర లోని కస్మూర్ మస్తాన్ బాబా వారి పేరిట స్థాపించబడిన జెండా కట్ట లో మస్తాన్ బాబా ఉరఫ్ కరీముల్లా కాలేషా పీర్ వారి గంధోత్సవాన్ని అంగరంగ వైభవంగా టీడీపీ పట్టణ అధ్యక్షుడు మహ బూబ్ బాషా నిర్వహించారు. ముం దుగా స్వామి పేరిట గంధాన్ని మరి యు జెం డాలను ఫేకీర్ల జరబులతో పట్టణ వీధుల్లో ఊరేగించారు. మిరియాల బాబా గౌసియా ఆశ్రమం మీదుగా పయనమైన మస్తాన్ బాబా వారి గంధాన్ని ఆశ్రమ పీఠాధిపతి మరియు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మషాయక్ అసోసియేషన్ తిరుపతి జిల్లా అధ్యక్షులు ఖ్వాజా జుబేర్ హయాత్ ఖాదరి తన శిష్య బృందం అయిన తిరుపతి జిల్లా బీజేపీ పార్టీ మైనారిటీ నాయకులు మరియు ఆంధ్ర ప్రదేశ్ మషాయక్ అసోసియేషన్ తిరుపతి జిల్లా కార్యదర్శి ఏ ఒన్ క్యాటరింగ్ మస్తాన్ మరియు జాఫర్ తో కలిసి స్వామి పేరిట ఫాతెహా నిర్వహించి ఆశ్రమ ప్రసాదం అయిన పవిత్ర రొట్టెలను ప్రసాదంగా పంచారు. అనంతరం మస్తాన్ బాబా జెండా కట్ట చేరిన గంధాన్ని ఫాతెహా నిర్వహించి అన్న దానాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో టైలర్ మస్తాన్, సుభాన్, పాలిష్ భాయి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ పరశురామేశ్వర స్వామి సేవలో దేవాదాయ ధర్మాదాయ కమిషనర్ రామచంద్ర మోహన్



స్వర్ణ సాగరం ఏర్పేడు జూన్ 14:-

గుడిమల్లం శ్రీ పరశురామేశ్వర స్వామి సేవలో దేవాదాయ ధర్మాదాయ కమిషనర్ రామచంద్ర మోహన్ గారు వారి కుటుంబ సభ్యులు స్వామివారి దర్శనానికి విచ్చేశారు, వారికి ఆలయ మర్యాదలతో ఆలయ అధికారులుస్వాగతి ఏర్పాటు చేసి స్వామి అమ్మవారి దర్శనాన్ని చేయించి తీర్థప్రసాదాలు ఇచ్చారు, ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా దేవాదాయ శాఖ అధి కారి పి రామకృష్ణారెడ్డి, తిరుపతి తనిఖీ అధికారి పనిరాజసైన, మరియు ఆలయ ప్రధాన అర్చ కులు వంశీకృష్ణ శర్మ, ఆలయ అర్చకులు యోగేంద్ర పవన్ కుమార్ శర్మ సిబ్బంది పాల్గొన్నారు.

## గుడిపాల మండలంలో ఈ శనివారం వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చం నాయుడు పర్యటించారు






గుడిపాల స్వర్ణ సాగరం జూన్ 14

గుడిపాల మండలంలోని ఫుడ్ అండ్ ఇన్స్ ప్యాక్టరీ పర్యటనలో భాగంగా మామిడి రైతులును ఆదుకోవటానికి మామిడి గుజ్జు పరిశ్రమ ఫుడ్ అండ్ఇన్స్ నుపరిశీలించారు, అనంతరం రైతులు తో మాట్లాడుతూ మామిడి గుజ్జు పరిశ్రమలో ఎక్స్పోర్ట్ లేక నష్టాల బాటలో నడుస్తుండడం తో అటు పరిశ్రమలు ప్రభుత్వం నిర్ధారించిన ఎనిమిది రూపాయలు ప్రభుత్వం నాలుగు రూపాయలు ఇచ్చి రైతులను ఆదుకుంటుందని తెలియజేశారు, అదేవిధంగా రైతులకు కూడా సమన్వయం పాటించి పూర్తి పక్వానికి వచ్చిన మామిడి పళ్ళను మాత్రమే గుజ్జు పరిశ్రమలకు అమ్మవలసిందిగా సూచించారు రైతుల నుండి మామిడి పంట చివరి వరకు గుజ్జు పరిశ్రమలు కొనుగోలు చేస్తాయని కావున ఏ రైతు అధైర్య పడవలసిన అవసరం లేదని సమన్వయం పాటించి గుజ్జు పరిశ్రమలకు అమ్మవలసిందిగా కోరారు, ప్రతి ఒక్క రైతు తమ ఆధార్ కార్డు భూమి పాస్బుక్ జిరాక్స్ మరియు బ్యాంక్ అకౌంట్ ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసుకుని ఈ సదవకాశాన్ని తప్పక సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు,ఈ కార్యక్రమానికి చిత్తూరు నియోజకవర్గ ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మరియు ఎంపీ దగ్గుమల ప్రసాద్ రావు, జాయింట్ కలెక్టర్ విద్యా దరి, వ్యవసాయ శాఖ అధికారులు మరియు గుడిపాల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చలి చీమల సుబ్రహ్మణ్యం నాయుడు, బాలాజీ నాయుడు, అనిల్ చౌదరి, తుమ్మల సాంబశివ నాయుడు, కూటమి ప్రభుత్వ పార్టీ కార్యకర్తలు మరియు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రజా ప్రగతి ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో రైతులకు సహజ వ్యవసాయం పైన శిక్షణ కార్యక్రమం







బుచ్చినాయుడు కండ్రిగ స్వర్ణ సాగరం జూన్ 14

ఏర్పాటు చేయడం జరిగినది. ప్రజా ప్రతి ట్రస్ట్ చైర్మన్ ఎం శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజా ప్రగతి ట్రస్ట్ 40 సంవత్సరాలుగా మహిళల జీవనోపాధిని మెరుగుపరచడం, మహిళా సాధికారత సాధించడం, పిల్లల విద్య అభివృద్ధికి రైతులకు వ్యవసాయం నందు పెట్టుబడి తగ్గించి ఎక్కువ ఆదాయం పొందే విధంగా వారికి కావాల్సిన నైపుణ్యాన్ని అందించడం భూసారం తగ్గిపోయి రోజు రోజుకి వ్యవసాయం నందు పెట్టుబడులు అధికమై ఫలితాలు తక్కువ రావడం వల్ల రైతు నష్టపోతున్నాడని ఈ పరిస్థితులలో రైతుకు ఆదాయం వచ్చే విధంగా భూమిని సారవంతం చేయాలని ఉద్దేశంతో రైతులందరికీ సహజ వ్యవసాయం అంటే ఏమిటి ఎలా సాగు చేయాలి అనేటువంటి విషయాల పైన శిక్షణ ఏర్పాటు చేశామని తెలియజేయడం జరిగింది. తరువాత ప్రాజెక్ట్ మేనేజర్ అయినటువంటి నాగరాజ్ మాట్లాడుతూ రైతులందరినీ ఒక ఎఫ్ ఐ జి గ్రూప్ గా ఏర్పాటు చేసి వారికి సహజ వ్యవసాయం చేయడానికి ఉన్న సమస్యలు తెలుసుకుని వారికి జీవామృతం ఘనజీవామృతం కషాయాలు తయారు చేయడంలో శిక్షణ ఇవ్వడం జరిగింది. తర్వాత ఏపీ సి ఎన్ ఎఫ్ నుండి వెంకటాచలం. వెంకటేశ్వర్లు సహజ వ్యవసాయం అంటే ఏమిటి, ఏ విధంగా చేయాలి ప్రస్తుతం భూమి ఏ పరిస్థితుల్లో ఉంది భూమిలో సూక్ష్మ జీవులను మేల్కొలపాలంటే ఏం చేయాలి అనే విషయాల గురించి తెలియజేస్తూ రైతులకు జీవామృతం, ఘనజీవామృతం, బిజామృతం తయారు చేయడం నేర్పించడం జరిగినది. తర్వాత సహజ వ్యవసాయంలో చీడపీడలను కషాయం ద్వారా ఎలా నివారించవచ్చని తెలియజేయడమైనది. ప్రతి రైతు క్రమం తప్పకుండా సహజ వ్యవసాయ పద్ధతిలో పంటకు జీవామృతం ఘనజీవామృతం చీడపీడల నివారణకు కషాయాలు సరైన సమయంలో అందించినట్లయితే ఎట్టి పరిస్థితుల్లో గాని దిగుబడి తగ్గదని అదేవిధంగా భూసారం కూడా పంట పంటకు పెరుగుతుందని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమం నందు 40 మంది రైతులు, ప్రజా ప్రగతి ట్రస్ట్ నుండి సుబ్రహ్మణ్యం, ఓంకార్, తిరుపాల్, దేవేంద్ర చెంచురామిరెడ్డి, వేణుగోపాల్, ఈశ్వరయ్య పాల్గొనడం జరిగినది.

## శ్రీ వెంకటేశ్వర ఫార్మసీ కళాశాలలో బి.ఫార్మసీ పట్టభద్రుల దినోత్సవం నిర్వహించిన యాజమాన్యం



**స్వర్ణసాగరం చిత్తూరు జూన్-14**

చిత్తూరులోని శ్రీ వెంకటేశ్వర ఫార్మసీ కళాశాల (అటానమస్) ఆర్ వి ఎస్ నగర్ బి.ఫార్మసీ విద్యార్థుల పట్టభద్రుల వేడుక ఘనంగా నిర్వహించబడం జరిగింది. విద్యార్థుల విద్యార్హతలకు గుర్తింపుగా ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ కార్యక్రమం, విద్యార్థుల స్ఫూర్తిని రెట్టింపు చేస్తోంది.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా అపోలో మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ సత్యనారాయణ హాజరై, విద్యార్థులను ఉద్దేశించి ప్రేరణాత్మకంగా ప్రసంగించారు. "పరిశ్రమల్లో నాణ్యతతో పాటు నైతిక విలువలూ అంతే ముఖ్యమైనవి. నేటి యువత విజ్ఞానంతో పాటు మానవతా విలువలను కూడా పెంపొందించుకోవాలి," అని ఆయన వ్యాఖ్యానించారు.జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం తరఫున హాజరైన డాక్టర్ దేవన్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ, మెరుగైన విద్యతో దేశాభివృద్ధిలో యువత పాత్రపై వివరించారు.కళాశాల వైస్ చైర్మన్ రావూరి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతీస్వరి కూడా విద్యార్థులను ఆశీర్వదిస్తూ, కళాశాల వారు అందిస్తున్న విద్యా ప్రమాణాలపై విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం, సాంస్కృతిక కార్యక్రమాలు, మెరిట్ అవార్డుల పంపిణీ, సర్టిఫికేట్ల అందజేత నిర్వహించబడింది. విద్యార్థుల కృషిని అభినందిస్తూ కళాశాల వేదిక గొప్ప మైలురాయిగా నిలిచింది.

## టిప్పర్ టూవీలర్ ఢీ ఇద్దరు మృతి ఒకరికి గాయాలు





**స్వర్ణ సాగరం బైరెడ్డిపల్లి జూన్ 14:-**

చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండలం తీర్థం గ్రామం వద్ద టిప్పర్ టూవీలర్ది ఇద్దరు మృతి ఒకరికి బలమైన గాయాలు ఈ సంఘటన మండలంలో చోటుచేసుకుంది తీర్థం గ్రామ సమీపాన బెంగళూరు టు చెన్నై హైవే పనులు జరుగుతూ ఉండడంతో టిప్పర్ల డ్రైవర్లు అతివేగంగా డ్రైవింగ్ చేస్తూ ఉన్నారని గ్రామస్తుల ఆవేదన ఈ సంఘటనలో తీర్థం గ్రామంలోనే టు వీలర్ లో వెళ్తున్న తరుణంలో టిప్పర్ వేగంగా వచ్చి ఢీకొనడంతో ద్విచక్ర వాహనంలో పయనిస్తున్న మహమ్మద్ 28 సం. బాబు 30 సం అక్కడికక్కడే మరణించారు రఫిక్ 25సం. ఇతని స్థానికుల సహాయంతో 108 వాహనం ద్వారా బైరెడ్డిపల్లి హాస్పిటల్ తరలించినట్లు సమాచారం.

# టోకెన్ సిస్టం రద్దుకు....ఉన్నదాధికారులు ఆమోదం..?









### కాంగ్రెస్ పార్టీ నిరసన తో దిగివచ్చిన ఫ్యాక్టరీ యాజమాన్యం
### కలెక్టర్ ను అభినందించిన..
### కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రమేష్ బాబు

**గంగాధర నెల్లూరు: శ్రీరంగరాజపురం :స్వర్ణ సాగరం: (జూన్ 14)**

కాంగ్రెస్ పార్టీ తరఫున మామిడి రైతులకు అండగా కొత్త టోకెన్ రద్దు చేయమని నిరసన తెలియజేసిన కారణంగా, శనివారం కలెక్టర్ చొరవ తీసుకొని ఫ్యాక్టరీ యాజమాన్యంతో మాట్లాడి రైతుల సమస్యలను వెంటనే అమలుపరిచినందుకు గంగాధర్ నెల్లూరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ డి రమేష్ బాబు రైతుల పక్షాన అభినందనలు తెలిపారు. శనివారం ఆయన కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి మరోసారి రైతులతో నిరసన వ్యక్తం చేస్తూ మామిడి రైతుల దీన బాధను ఫ్యాక్టరీ యాజమాన్యం గుర్తించి వెంటనే తగు చర్యలు చేపట్టాలని నిరసన చేపట్టారు. అలాగే టోకెన్ల విధానాన్ని రద్దు చేసి, పాత పద్ధతి ద్వారా కొనుగోలు చేయాలని దిస్ అనే ఉద్దేశం చేశారు. మామిడి రైతులకు కొత్తగా ప్రవేశపెట్టిన టోకెన్ విధానాన్ని రద్దుచేసి పాత పద్ధతిలోనే డైరెక్ట్ గా ఫ్యాక్టరీ వద్ద సీరియల్ ప్రకారము టోకన్లు లేకుండా నేరుగా అమ్ముకునే విధంగా చిత్తూరు జిల్లా కలెక్టర్ వారు చర్యలు తీసుకోవడం అభినందనీయం , అందుకుగాను కాంగ్రెస్ పార్టీ తరఫున కలెక్టర్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాం.

నిన్నటి రోజు చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు జైన్ ఫ్యాక్టరీ వద్ద మామిడి రైతులు తీవ్రంగా ఆందోళన చెందినారు, మామిడి రైతులకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ తరఫున జైన్ ఫ్యాక్టరీ వద్ద కొత్తగా ఏదైతే టోకెన్ సిస్టం పెట్టి దాంట్లో అనేక అవకతవకులకు పాల్పడినటువంటి యాజమాన్యాన్ని వ్యతిరేకిస్తూ మేము నిరసన వ్యక్తం చేయడం జరిగింది. అందులో భాగంగా ఈరోజు కూడా జైన్ ఫ్యాక్టరీ వద్ద మామిడి రైతులు చాలా ఆందోళనకు గురి కావడం, వెంటనే కాంగ్రెస్ పార్టీ తరఫున మేము స్పందించి రైతుల పక్షాన యాజమాన్యంతోను అధికారులతోనూ మాట్లాడడం జరిగింది ,ఏదైతే కొత్తగా టోకెన్ సిస్టం పెట్టి ఆ టోకెన్ సిస్టం కూడా సక్రమంగా అమలు చేయని కారణంగా టోకన్ విధానాన్ని రద్దుచేసి గతంలో ఏదైతే టోకెన్ సిస్టం లేకుండా ఎవరు ముందొస్తే వారికి అన్నట్టు సీరియల్ నెంబర్ ప్రకారం మామిడి సరఫరా చేయడానికి మేము గట్టిగా అడగడం జరిగింది అధికారులు కూడా రైతుల పక్షాన మా విన్నపాన్ని గ్రహించి కలెక్టర్ గారి దృష్టిలో పెట్టినారు, కొత్తగా టోకెన్ సిస్టం రద్దు చేయవలసిందిగా కోరినారు. కలెక్టర్ గారు తక్షణమే స్పందించి మామిడి రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఏదైతే కొత్తగా ఈ టోకెన్ సిస్టం ఉందో ఆ టోకెన్ సిస్టంను వెంటనే రద్దు చేయవలసిందిగా అధికారులను మరియు ఫ్యాక్టరీ యాజమాన్యానికి కోరడం జరిగింది, కాబట్టి రైతులందరూ కూడా ఆందోళన చెందకుండా సోమవారం నుంచి ప్రతి ఒక్కరూ తన మామిడిని నేరుగా సీరియల్ ప్రకారం ఫ్యాక్టరీ వద్దకు తీసుకెళ్లి విక్రయించుకోవలసినదిగా మేము కోరి ప్రార్థిస్తున్నాము . ఇందుకు సహకరించినటువంటి రైతులకు, కాంగ్రెస్ పార్టీ లీడర్లకు, కృతజ్ఞతలు తెలిపారు.

# వైభవంగా స్వర్ణ రథోత్సవం









**కాణిపాకం జూన్ 14 స్వర్ణ సాగరం**

కాణిపాకం వైభవంగా స్వర్ణ రథోత్సవం . కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం ఆస్థాన మండపం నందు శనివారం సంకటహర చతుర్థి సందర్భంగా శ్రీ స్వామివారికి వైభవంగా ఉదయం మరియు సాయంత్రం సంకటహర గణపతి వ్రతం నిర్వహించడం జరిగింది, రాత్రి వైభవంగా ఆలయ మాడా వీధుల్లో స్వర్ణ రథోత్సవం (బంగారు రథోత్సవం) కోలాటాల నడుమ జన సందోహం భక్తులతో అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగింది,ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు డాక్టర్ కలికిరి మురళీమోహన్ , దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్ చిత్తూరు ఏఎస్పీ రాజశేఖర్ రాజు, సీఐ శ్రీధర్ నాయుడు, దేవస్థానం మాజీ చైర్మన్ మణి నాయుడు, ఆలయ ఏఈవో రవీంద్రబాబు, సూపర్డెంట్లు కోదండపాణి, వాసు , టెంపుల్ ఇన్స్పెక్టర్లు బాలాజీ నాయుడు, రవి, స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు సంతోషంగా వున్నారు

- బుచ్చిరెడ్డి పాళెం పట్టణ పరిధిలోని ఇస్కపాళెం తాగునీటి సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు.
- రోడ్లు, డ్రైన్లు లాంటి మౌలిక సదుపాయాల కల్పనకు తొలి ప్రాధాన్యత.
- బుచ్చి పట్టణ అవసరాల కోసం మరో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మించేందుకు స్థలాన్వేషణ చేస్తున్నాం.
- సూపర్ సిక్స్ దశల వారీగా అమలు చేస్తాం.
- అహమ్మదాబాద్ విమాన ప్రమాదంలో అశువులు బాసిన వారికి నివాళులు.
- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి.



**కోవూరు,స్వర్ణ సాగరం, జూన్ 14 :**

బుచ్చిరెడ్డి పాళెం పట్టణ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నట్టు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారు వెల్లడించారు. బుచ్చి పట్టణ పరిధిలోని 3 వ వార్డులో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారికి స్థానికి నాయకులు ఘన స్వాగతం పలికారు. స్థానిక ప్రజా ప్రతినిధులు మరియు నాయకులతో కలిసి ఆమె 3 వ వార్డులోని ఇస్కపాళెం, అరుంధతివాడ, దుర్గానగర్ తదితర ప్రాంతాలలో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల పై ఆమె ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి గారు అహమ్మదాబాద్ లో విమాన ప్రమాదంలో అశువులు వారి ఆత్మశాంతి కోరుతూ రెండు నిమాషాలు మౌనం పాటించి ప్రసంగం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బుచ్చిరెడ్డి పాళెం పట్టణంలో ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన 2.0 పథకంలో భాగంగా ఇళ్ళు లేని 286 నిరుపేదలకు ఇళ్ళు మంజూరు అయ్యాయన్నారు. లబ్దిదారులకు 2 లక్షల 50 వేలతో ప్రభుత్వం ఇళ్ళు నిర్మించి యివ్వనుందన్నారు. 3 వ వార్డు పరిధిలోని ఇస్కపాళెం అరుంధతి వాడలో తాగునీటి సమస్యను సత్వరమే పరిష్కరించాలని ఆమె అధికారులను ఆదేశించారు. కృష్ణా థియేటర్, దుర్గా నగర్ ప్రాంతాలలో త్వరలోనే రోడ్లు, డ్రైన్ల నిర్మాణం చేపడతామన్నారు.

కూటమి ప్రభత్వం అధికారంలోనికి వచ్చాక బుచ్చిరెడ్డి పాళెం పట్టణంలో ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి పనులు చేసుకుంటూ వేస్తున్నామన్నారు. ఇప్పటికే వివిధ వార్డులలో జనరల్ ఫండ్స్, ఎంపి లాడ్స్, CSR ఫండ్స్ ద్వారా చేస్తున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. తేజా డెవలపర్స్ వారి CSR ఫండ్స్ ద్వారా చేపట్టిన మార్కెట్ నిర్మాణం దాదాపు పూర్తయిందని త్వరలోనే ప్రారంభించనున్నామన్నారు. బుచ్చి పట్టణంలో విద్యుత్ ఓవర్ లోడ్ తగ్గించేందుకు పంచేడు వద్ద ఒక 33 కెవి సబ్ స్టేషన్ నిర్మాణంలో వుందని బుచ్చి పట్టణంలో మరో 33 కెవి సబ్ స్టేషన్ నిర్మాణానికి స్థలాన్వేషణ చేస్తున్నామన్నారు. నాగమాంబపురం వద్ద ఆటోనగర్ నిర్మాణంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఎన్నికలకు ముందు యిచ్చిన ప్రతి హామీ అమలుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. ఈ నెల 20 న అన్నదాత సుఖీభవ పథకం, ఆగష్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకాలు అమలు చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారి చొరవతో రాష్టంలో గుంతల రోడ్లు మాయమయ్యాయన్నారు. మంత్రి లోకేష్ గారు విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొస్తున్నారని రాష్టంలో విన్నూత్నంగా ప్రతి క్లాస్ కు ఒక టీచర్ విధానాన్ని తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో,బుచ్చిరెడ్డి పాళెం నగర పంచాయతీ చైర్ పర్సన్ మోర్ల సుప్రజ, స్థానిక కౌన్సిలర్, వైస్ చైర్మన్లు యారటపల్లి శివకుమార్ రెడ్డి, నస్రీన్ ఖాన్, కౌన్సిలర్లు పుట్ట లక్ష్మి కాంతమ్మ, శ్రీదేవి బుచ్చి మండల అర్బన్, రూరల్ టిడిపి అధ్యక్షులు గుత్తా శ్రీనివాసరావు, టంగుటూరి మల్లారెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# కెన్యా అడవుల్లో విధ్వంసం సృష్టించబోతున్న మహేష్ బాబు.. లభించిన అనుమతులు

సూపర్ స్టార్ మహేష్ బాబు, స్టార్ డైరెక్టర్ రాజమౌళి కాంబినేషన్‌లో క్రేజీ ప్రాజెక్ట్ రూపొందుతున్న విషయం తెలిసిందే. ఈ చిత్రం కోసం మహేష్ బాబు అభిమానులే కాదు సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.ఎస్ఎస్ఎంబీ 29 ప్రారంభమైన నాటి నుంచి ఈ సినిమా కథేంటీ? నటీనటులు ఎవరు ? టెక్నీషియన్స్ ఎవరు ? బడ్జెట్ ఎంత, షూటింగ్ లొకేషన్స్ ఏంటి అంటూ మహేశ్ అభిమానులు తెగ చర్చించుకుంటున్నారు. అయితే ఇప్పటికే రెండు షెడ్యూల్స్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలో మూడో షెడ్యూల్ జరుపుకోనుంది. జూలై రెండో వారం నుంచి ఈ షెడ్యూల్ కెన్యాలో ప్రారంభంకానున్నట్లు సమాచారం. కెన్యా షెడ్యూల్‌లో రాజమౌళి భారీ యాక్షన్ ఎపిసోడ్స్, ఛేజ్ సీక్వెన్స్‌లు చిత్రీకరించనున్నట్టు టాక్ నడుస్తుంది. కెన్యాలోని అటవీ ప్రాంతంలో నెలరోజుల పాటు ఈ షెడ్యూల్ జరగనుందట.. ఈ షెడ్యూల్ కోసం రాజమౌళి, మహేష్ బాబు, ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ఇతర చిత్ర యూనిట్ మొత్తం కెన్యాకు త్వరలో పయనం కానున్నారు. ఇప్పటికే కెన్యాలో చిత్ర షూటింగ్‌కి అనుమతి లభించినట్టు చెబుతున్నారు. కెన్యా లోని ప్రఖ్యాత అంబోసెలి నేషనల్ పార్క్ లో కూడా రాజమౌళి కొన్ని కీలక సన్నివేశాలని తెరకెక్కించనున్నారని అంటున్నారు. ఇండియన్ సినిమాకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడమే లక్ష్యంగా రాజమౌళి ఈ ప్రాజెక్ట్‌ను భారీ ఎత్తున తెరకెక్కిస్తున్నారు. ఇక ఈ చిత్రంలో మహేష్ బాబు లుక్ సరికొత్తగా కనిపించనున్నట్టు తెలుస్తుంది. ఎస్ఎస్ఎంబీ 29 ఫోటోలు, సీన్స్, క్లిప్స్ ఎక్కడా లీక్ కాకుండా రాజమౌళి పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు రాజమౌళి. ఈ చిత్రానికి కీరవాణి సంగీతం, విజయేంద్ర ప్రసాద్ కథ అందిస్తున్నారు. 1000 కోట్ల బడ్జెట్ లో కెఎల్ నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 2027లో మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని భావిస్తున్నారు రాజమౌళి.





## ఆకట్టుకుంటున్న 'కన్నప్ప' ట్రైలర్.. మీరు చూశారా?

మంచు విష్ణు హీరోగా నటిస్తూ, భారీ బడ్జెట్‌తో తీసిన సినిమా 'కన్నప్ప'. ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్ లాల్ లాంటి స్టార్ హీరోలు ఇందులో అతిథి పాత్రలు చేశారు. మోహన్ బాబు, కాజల్ తదితరులు ఇతర పాత్రలు పోషించారు. జూన్ 27న థియేటర్లలోకి రాబోతున్న ఈ చిత్ర ఈవెంట్ తాజాగా కొచ్చిలో నిర్వహించారు. అక్కడే మోహన్ లాల్ చేతుల మీదుగా ఇప్పుడు ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. ట్రైలర్ చూస్తుంటే విజువల్స్, బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ ఆకట్టుకున్నాయి. ప్రభాస్ స్క్రీన్ పెజెన్స్ కూడా అభిమానులకు నచ్చేలా ఉంది. గతంలో వచ్చిన కంటెంట్‌పై వచ్చింది. ట్రైలర్‌ని మాత్రం ట్రోలింగ్‌కి స్కోప్ లేకుండా బాగానే కట్ చేశారు. అలానే స్టోరీ ఏంటనేది కూడా చూచాయిగా చెప్పేశారు కూడా. సినిమా ఎలా ఉండబోతుందనేది కూడా ట్రైలర్‌తో శాంపిల్ చూపించేశారు. ఓ గూడెంలో నివసించే తిన్నడు (మంచు విష్ణు).. చిన్నప్పటి నుంచి దేవుడిని పెద్దగా నమ్మడు. పెద్దయిన తర్వాత కొన్ని సంఘటనల వల్ల గూడెం నుంచి ఇతడిని వెలివేస్తారు. అదే టైంలో నెమలి (ప్రీతి ముకుందన్?)తో ప్రేమలో పడతాడు. తర్వాత శివుడు(అక్షయ్ కుమార్), రుద్ర(ప్రభాస్)ని భూమ్మీదకు పంపిస్తాడు. రుద్ర వల్ల తిన్నడు.. అతిపెద్ద శివభక్తుడు ఎలా అయ్యాడు? ఈ మొత్తం కథలో వాయు లింగం సంగతేంటి అనేదే స్టోరీలా అనిపిస్తుంది.

# మళ్లీ వాయిదా పడిన 'కుబేర' ట్రైలర్

%ఖబఎవతీఖ ఁతీఖఅశ్రీవతీ% ఎ టాలీవుడ్ దర్శకుడు శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం కుబేరా. ధనుష్, నాగార్జున, రష్మిక మందాన్న ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం జూన్ 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఈ సినిమా ట్రైలర్‌ను మొదటగా జూన్ 13న విడుదల చేస్తామని చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. అహ్మదాబాద్ విమాన ప్రమాదం జరగడంతో ట్రైలర్ విడుదల వాయిదా వేసి జూన్ 14న విడుదల చేస్తామని ప్రకటించింది. అయితే తాజాగా జూన్ 14న కూడా ట్రైలర్ విడుదలను వాయిదా వేసినట్లు తెలిపింది. ఈ సినిమా ట్రైలర్‌ను జూన్ 15న జరుగబోతున్న కుబేర గ్రాండ్ ప్రీ-రిలీజ్ ఈవెంట్లో విడుదల చేయబోతున్నట్లు తాజాగా ప్రకటించింది.

